PRAMUKHANDHRA 26th Year of Publication We carry the news and views of Telugus

26 వ సంవత్సరం

ప్రముఖాంధ్ర

₹.15
డిసెంబర్ 2020

వ్యవస్థాపకులు
శ్రీ గోటేటి శ్రీరామారావు

THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA

అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ

- మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్ధ, వృద్ధ భారాన్ని మోస్తూనే

312 నెలలుగా
312 సంచికలను

శ్రీ వేంకటేశ చరణౌ చరణం ప్రపద్యే।

ప్రముఖాంధ్ర

- వెలువరించ కలిగిదందంటే ఏడుకొండల తేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!

'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యథోచితంగా సహకరించండి.
రు.10000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)

గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు

చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com

ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

డిసెంబరు 2020

సంపుటి : 26 (312) సంచిక : 12

హిందువుగా మసలండి, హిందువుగా పెరగండి; హిందూస్థాన్ అనండి!

సారే జహాఁసే అచ్ఛా,హిందూస్థాన్ హమారా'యని 'వందేమాతరమ్' ప్రార్థన గిట్టనివాళ్లు ప్రత్యామ్నాయంగానూ, గిట్టిన వాళ్లు భక్తి పూర్వకంగానూ పాడేవారు. అలాటివాళ్లందరిలోఏఁవి చెడు భావాలు పొడసూపాయోగానీ హిందూస్థానం అనడం మానేశారు ('భారతదేశం' అని పలుకడం ఎప్పుడో మరిచిపోయారనుకోండి.) 'ఇండియా' అనే ఎంగిలీషు పదానికి అలవాటు పడ్డారు. నేను 'ఇండియన్' అంటున్నారు. దేశంలోని రాష్ట్రాల పేర్లూ, నగరాల పేర్లూ, చెన్నయ్ యనీ, ముంబైయనీ మార్చుకుని 'ఇండియా'ను 'హిందూస్థాన్'గా గానీ, భారతదేశంగాగానీ యని పిలవాలనెడి 'ధ్యాస' కలుగనే లేదు. మనకు స్వతంత్ర భావన ఉంటేనే కదా! ఏడువందల సంవత్సరాల పైచిలుకు బానిస బ్రతుకు నెరిపినవారికి స్వతంత్ర భావాలు కలుగుతాయని భావించడం నాదే పొరపాటు. కానీ పాలు త్రాగుతూ రొమ్ము గుద్దేవారిని చూస్తూంటేనే ఒకింత జుగుప్సగా, ఒకింత భయంగా ఉంది.

సత్కృతాశ్చ కృతార్థశ్చ మిత్రాణాం న భవంతియే
తానే మృతాన పిత్రవాద్యాః కృతఘ్నానో భజంతే

– అని పెద్దలన్నట్టు–మిత్రుల వలన గౌరవ సత్కారములు పొంది, తమ పనులను కావించుకుని, అనన్తరం వారి మేలును తలవని కృతఘ్నులు ఉన్నారే అట్టివారు చచ్చిన తరువాత వారి శరీరాల్ని కుక్కలు, ఇతర హీనజాతి నక్కలు సహితమూ ముట్టవు–అని చెబుతారు. ఈ దేశంలో ఉన్న చాలామంది దేశనాయకుల బుద్ధులు అలాగే ఉన్నాయ్.

భారతదేశంలోని అంతర్రాష్ట్రంగా ఉంటూన్న తమిళనాడు దేశభక్తిని ప్రకటిస్తూన్నట్టుంటూ – తమ భాష పట్ల, తమ తమిళులు ఎక్కడున్ననూ వారిపట్ల మక్కువను ప్రకటిస్తూ, తమ పన్నులన్నిటినీ సాధించుకుంటూంటే – మన ఆంధ్ర రాష్ట్రంలోని పాలిత, ప్రతిపక్షాల్లోనున్న వారికి తమ భాష, సంస్కృతీ సాంప్రదాయాల పట్ల విధేయతను చూపకుండా, మైనారిటీలు మైనారిటీ లంటూ, ముస్లిములు (బంగ్లాదేశ్ నుంచీ దిగుమతియైన వారి పట్ల), క్రైస్తవుల పట్ల పెద్ద పీట వేసి మనవారి 'నెత్తి' కొడ్తున్నది. పోనీ వారిలో ఇప్పటి అబ్దుల్ కలాం, అప్పటి ఆజాద్, గఫూర్‌ఖాన్ (సరిహద్దు గాంధీ), వంటి భారతదేశ భక్తులు ఓ అయిదు మంది కూడా కనపడరు. అందరూ మన భూమిపై గాలి పీల్చి, నీరు త్రాగి, తింటున్నవారే! నలభై ఏడు కోట్ల హిందూ జనాభా హిందువులు కు.ని పాటిస్తున్న తరువాత కూడా, వంద కోట్లకు ఎలా పెరిగారు – మతాల మార్పిడులు ఎందుకు చేసుకుంటున్నారు –ఒక్కసారి ఆలోచించండి!

'హిం'దూత్వం' అనునది ఒక మతమునకు గానీ, కులమునకు గానీ చెందినది కాదు. ఏ ఒక్కరో స్థాపించినది కాదు. సమస్త విశ్వంలోని సమస్త ప్రాణుల మనుగడకు, అభ్యున్నతికి అవాంతరములు కల్పింపని, అవరోధములు కల్గించని జీవన విధానమూ. జీవాధారమూ నేర్పిన మహోజ్వల మహత్తర మంజుల పరస్పర సహకారమెలకువలను నేర్పినట్టి సర్వసమ జీవనతత్వం. నిజానికి ఇది భారతీయాత్మ. సర్వమంగళకరమైన సమ్మోహనకరమైన, సర్వజీవుల కవసరమైన సమధర్మమును నేర్పిన సనాతన ధర్మమిది. సనాతన ధర్మతత్వ స్వరూపమే హిందూధర్మం. గాకపోతే తనపై దండెత్తిన, 'తన్ను గాయపరిచిన, తన్ను రక్తసిక్తమొనర్చిన, తన రక్తాన్ని త్రావినవారిని సహితమూ సహించినది ఈ హిందూ దేశమే.

నలుబది కోట్లుగా ఉండే భారతీయులు నూరుకోట్లకు మించిన సంఖ్యకు, ఎలా చేరగలిగారు, ఎలా ఇందరు 'ఇండియా' పౌరసత్వాన్ని పొంది ఏకుమేకులుగ విజృంభిస్తున్నారు! అయినప్పటికినీ భారతమాత ఎంతటి సహనమూ, ఎంతటి సంయమనమూ పాటిస్తున్నదీ గ్రహిస్తే, సనాతన ధర్మవైశిష్ట్యం, హిందూత్వ ఔదార్యమూ ఇంకా భాసిల్లుతూనే ఉన్నదంటే అది భరతవర్ష మట్టి ఘన సంస్కృతి. గొడ్డలి వేటు వేసినవాణ్ణి సహితమూ, 'అరే' నీ చేయి నొచ్చిందిరా అన్న 'క్షమా'గుణం గల ధరిత్రి యీ భారత భారతీ ధరిత్రి. అన్యులు గుళ్లు కొల్లగొట్టారు, గోపురాలు కొల్లగొట్టారు. నగలుగా ఉన్న బంగారాన్ని దోచుకున్నారు. రాతివిగ్రహాల్ను పగలగొట్టారు. ఆడవాళ్ల మానం దోచుకున్నారు. మగవాళ్ల నెత్తురును ఏరులుగా పారించారు. హైందవులుగా నామకరణం చేసి వెళ్లారు. హైందవజాతిగా పేరుబడిన జాతి ఇస్లాము పైన గానీ, బ్రిటీషర్లపైనగానీ పగ, ప్రతీకారాన్ని తీర్చుకోలేదు.

మనవాళ్లకు ఖాకీ బట్టలు తొడిగి మనవాళ్లనే తన్నించారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయిన బులుసు సాంబమూర్తికే ఈ అనుభవమైంది. తరువాత ఆయన స్పీకర్‌గా వచ్చి, తన చేతిలో అధికారం ఉండీ కూడా ఆ పోలీసు నాయుడిపై పగ తీర్చుకోలేదు. అదీ భరతజాతి, భారత జాతిలోని ఆంధ్రుని ఔదార్యం. మరో ఆంధ్ర దిగ్గజం టంగుటూరి ప్రకాశం పంతులు 'ఒరేయ్ ధైర్యం ఉంటే కాల్చండిరా' అంటూ లాల్చీబొత్తాములు తీసి గుండె చూపాడు. అంతకుపూర్వం అల్లూరి సీతారామరాజు గిరిజనులతో చేరి – 'వస్తున్నా – మీ పోలీస్‌స్టేషన్‌ను తగలబెడ్తున్నా – దమ్ముంటే ఎదుర్కోండి' అంటూ – అమాయక గిరిజనుల గుండెల్లో ధైర్యం నింపి, బ్రిటిష్ బలాల దెబ్బకు దెబ్బతీశాడు. పట్టుబడి కాల్చబడ్తూన్నప్పుడు కూడా వగవలేదు. జై భారతమాతా, జై తెలుగు తల్లీ అంటూ నేలరాలాడు. ఇలాగే కట్టబ్రహ్మననాయుడు ఎందరో తెలుగువారు. భగత్‌సింగ్ లాంటి ఉత్తరాది వారు దేశం కోసం ప్రాణార్పణం చేశారు.

లక్షలకు లక్షలు సంపాదించిన నాయకులంతా దేశ స్వాతంత్ర పోరాటంలో సర్వ సమూ కోల్పోయారు. హిందూత్వ మతం బొట్టు పెట్టినా, కాదనలేదు. అలనాటి సనాతన ధర్మాన్నే 'హిందూత్వం' అంటున్నారు కదాయని గర్వపడ్డారు.

ఆ హిందూత్వం ద్వారా, సంఘటి తత్వం ద్వారా స్వాతంత్రం పొందిన నికృష్ట నాయకులు హిందూత్వాన్ని మతతత్వం అంటే బాధ కలుగు తూంది. ఈ దేశంలోని ఈ మతం, ఈ ధర్మం, ఈ భూమీ అందరికీ కూడుపెట్టింది, గూడు యిచ్చింది, ఒంటినిండా కప్పుకునే గుడ్డ యిచ్చింది. తల్లి పాలు త్రాగి రొమ్ము గుద్దే వారిలా వ్యవహరించకండి. అందరూ ఏక దేశంగా, ఏకనాదంగా స్వతంత్ర భారతానికి జేజేలు పలు కండి. ఇంగ్లీషువాడు పెట్టిన 'ఇండియా'పేరును భారతదేశంగానో, హిందూస్థాన్‌గానో మార్చండి. ప్రేమను పెంచుకోండి!



బుధజన విధేయుడు
– గోటేటి శ్రీరామారావు
(ఆగస్ట్ 2009, ప్రముఖాంధ్ర)

Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com
YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-

కొబ్బరి తినాలంటే కష్టపడాలి. ముందు, పీచు తీయాలి. కఠినంగా ఉండే కాయ పైపెంకును పగలగొట్టాలి. లోపల కొబ్బరిని ముక్కలు చేయాలి. ఆ తరువాత నమిలితే, కొంతసేపటికిగాని దాని రుచి జిహ్వకు తెలియదు. అందుకే కష్టసాధ్యమైన ఆ రుచిని 'నారికేళ పాకం' అంటారు. సంగీత త్రిమూర్తులలో ఈ నారికేళ పాకాన్ని పోలి ఉండేవి ముత్తుస్వామిదీక్షితులవారి రచనలు. అసలే సంక్లిష్టమైన సంస్కృత భాష... రాగపరంగా విశేషమైన ప్రయోగాలు... సర్వదేవతా స్తుతులై, జ్యోతిష, మంత్రాది శాస్త్ర వైదుష్యంతో కూడిన లోతైన సాహిత్యం... దీక్షితుల కృతులలో మనం చూడవచ్చు. ఆబాలగోపాలం పాడుకొనేందుకు వీలుకానివి అవి.

సుబ్రహ్మణ్యేశ్వరుడు జ్ఞాన స్వరూపి. ఆయన అంశగా పేర్కొనదగిన దీక్షితుల కృతులూ జ్ఞాన నిధులే. వారు రచించినన్ని గుచ్ఛ కృతులు మరే వాగ్గేయకారులూ రచించలేదు. వాటిలో కొన్ని:

తిరుత్తణి గురుగుహ కృతులు (9)
శ్రీ మహాగణపతి కృతులు (26)
తిరువారూరు త్యాగరాజ కృతులు (13)
పంచభూత స్థల లింగ కృతులు (5)
తిరువారూరు పంచ శివలింగ కృతులు (5)
నీలోత్పలాంబా నవావరణ కృతులు (9)
కమలాంబా నవావరణ కృతులు (9)
అభయాంబా నవావరణ కృతులు (9)
నవగ్రహ కృతులు (9) ...

దీక్షితులవారు వైవిధ్య భరతమైన ప్రయోగాలెన్నో సంగీత, సాహిత్యపరంగా చేశారు. ఒకే కృతిలో సంస్కృతం, తెలుగు, తమిళ భాషల్ని ప్రయోగిస్తూ 'మణి ప్రవాళాలు', ఇంకా... చతుర్దశ రాగమాలిక, దశావతార రాగమాలిక... రచించారు. గణపతితో ఆరంభించి, అయ్యప్పస్వామి వరకూ ఆయన స్తుతించని దేవుడే లేడనటం అతిశయోక్తి కాదు.

అనేక తీర్థ క్షేత్రాలు దర్శించి, ఆయా దేవతలపై కృతులు రచించారు. వారణాశిలో కొంతకాలం ఉండటం చేత, హిందుస్థానీ సంగీత ప్రభావం వారి రచనలలో కనిపిస్తుంది. చిన్నతనంలో బ్రిటిష్ వారి బ్యాండ్ సంగీతం వినడంచేత, పాశ్చాత్య సంగీత బాణిలలో 'నోటు స్వరాలను' కూడా వారు రచించారు.

దీక్షితులవారు ఒకసారి త్యాగయ్యగారి ఊరు, తిరువయ్యారు వచ్చారు. అక్కడ వెలసిన పంచనదీశ్వరుని, ధర్మసంవర్ధనీ మాతను దర్శించుకొని, నాట రాగంలో 'పరమేశ్వర, జగదీశ్వర', మధ్యమావతి రాగంలో 'ధర్మ సంవర్ధనీ' కృతులను ఆసువుగా గానం చేశారు.

దీక్షితులవారి రాకను తెలుసుకొని, త్యాగయ్యగారి శిష్యులు, వారిని తమ గురువుగారి ఇంటికి సాదరంగా తీసుకువెళ్లారు. ఆరోజు త్యాగయ్యగారింట, 'రామాయణ పారాయణం' సంపన్నమైన సందర్భంగా, విశేషంగా శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం జరుగుతోంది.

దీక్షితులవారి రాకతో పరమానందభరితులైన త్యాగయ్యగారు, వారిని సగౌరవంగా ఆహ్వానించి, తన ఇంట కొలువైన శ్రీరామునిపై, దేవగాంధారి రాగంలో 'కొలువైయున్నాడే కోదండపాణి' అనే కీర్తనను, శిష్యబృందంతో కలసి, గానం చేసి, వినిపించారు.

ఆనాడే, త్యాగయ్యగారి కోరిక మేరకు, దీక్షితులవారు మణిరంగు రాగంలో 'మామవ పట్టాభిరామ' కృతిని ఆర్తిగా పాడారు. అక్కడ ఉన్న యావన్మంది భక్తులూ, ఆనందపరవశులై, దీక్షితులవారిని తగురీతి సత్కరించారు.

'గురుగుహ' ముద్రతో వజ్రాల వంటి రచనలెన్నో చేశారు దీక్షితులవారు.

దీక్షితులవారి వంటి మహోన్నతుల నిర్యాణం కూడా విశేషంగానే ఉంటుంది....

1835 వ సంవత్సరం, ఆశ్వయుజ బహుళ చతుర్దశి (నరక చతుర్దశి) నాడు యెట్టయాపుర సంస్థానాధీశులు దీక్షితులవారిని దర్శించుకొని, భయాందోళనలతో, 'స్వామీ! నా మది కీడును శంకిస్తోంది. గజశాలలోని గాంగేయుడనే గజం మతిభ్రమించి, గొలుసులు తెంపుకొని, స్మశాన వాటికకు వెళ్లి, ఘీంకరిస్తున్నది...' అని తెలిపారు. దీక్షితులవారు, భయపడవద్దని చెప్పి, రాజుగారిని పంపివేశారు.

మరికొంతసేపటికి, వారికి అన్నపూర్ణాదేవి తేజోమూర్తిగా దర్శనమిచ్చింది. తనకు భగవత్సాన్నిధ్యం లభించే సమయమాసన్నమైనదని గ్రహించి, నవావరణయుత శ్రీచక్రార్చన చేసి, పున్నాగవరాళి రాగంలో, 'ఏహి అన్నపూర్ణే సన్నిధేహి సదాపూర్ణే' అనే కృతి గానం చేశారు వారు.

తన శిష్యబృందాన్ని పిలిపించుకొని, వారితో తాను రచించిన గమకక్రియ రాగ కృతి 'మీనాక్షీ! మేముదందేహి' పాడించుకున్నారు. పద్మాసనాశీనులై, తానూ వారితో గొంతు కలిపి, 'మీనలోచనీ! పాశమోచనీ!' అనే సాహిత్యభాగం పాడుతూ, కనులు మూసుకొని, 'భవపాశమోచనీ! శివే!పాహి!' అంటూ, ఆనందాశ్రువులు కనులనుండి కారుచుండగా, ముకుళిత హస్తాలతో జగన్మాతను ధ్యానించారు.

శిష్యులు కృతిని పాడుతూనే ఉన్నారు...

అందరూ చూస్తూండగానే... ముత్తుస్వామి దీక్షితులవారి బ్రహ్మ కపాలం ఛేదించబడి, జీవాత్మ, పరమాత్మలో ఐక్యమైపోయింది.

అటువంటి మహనీయులను కన్న భరతభూమి మనది. ఆ మహనీయుల చరితం వినటమే సుకృతం.

– మొదుముది సుధాకర్

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

పరాశక్తి

దేవీ భాగవతంలో అమ్మవారు బ్రహ్మతో సంభాషిస్తూ స్త్రీ పురుష రూపాలు రెండూ తానే అని వివరిస్తుంది. స్త్రీ పురుష రూపాలు రెండూ వేరుకావని, ఆ రెండు రూపాలు ఒకటేనని విశదీకరిస్తుంది. సృష్టి కార్యానికై నిరూపిణి అయిన పరాశక్తి శక్తిగా, శివుడిగా రూపం దాలుస్తుంది. శక్తి బలానికి, సామర్థ్యానికి చిహ్నం కాగా శివ స్వరూపం చైతన్యానికి ప్రతీక. ఆ శక్తి రూపాంతరం చెంది స్థూలంగా పంచభూతాలుగా సృష్టిలో ఆవిర్భవిస్తుంది. సూక్ష్మ జగత్తులో అయిదు కర్మేంద్రియాలు (నోరు, చేతులు, కళ్ళు, మల మూత్ర విసర్జన అవయవాలు) పంచతన్మాత్రలు (శబ్దం, స్పర్శ, రూపం, రుచి, వాసన) జీవరాశులలో ప్రవేశిస్తాయి. ఈ విధంగా సృష్టిలో ఏర్పడిన ఎనభై నాలుగు లక్షల జీవరాశులలో మానవుడు ఒకడు అని వేదం చెబుతోంది. ఈ ఎనభై నాలుగు లక్షల జీవరాశులలో నాలుగు అంతఃకరణాలు (మనస్సు, హృదయం, బుద్ధి, ఆత్మ) వివిధ పరిణామ దశలలో నెలకొనగా, మానవుడిలో ఇవి ఉన్నత దశలో పరిణామం చెందుతాయి. మనస్సు అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాల వలయంలో ఆకర్షింపబడి సృష్టి లోని భౌతిక ప్రపంచాన్ని శరీరంతో అనుభవపూర్వకంగా గ్రహిస్తుంది. మనో రూపేక్షు కోదండ పంచ తన్మాత్ర సాయకా; (లలితా సహస్రం) అమ్మవారు తన మనస్సుని వామ హస్తంలోని చెరకు విల్లుగా ఎక్కుపెట్టి పంచతన్మాత్రలని తన ఐదు వేళ్ళతో సంధించి సృష్టి కార్యానికి నాంది పలుకుతుంది. అమ్మవారు సంధించి విడిచిన ఈ పంచతన్మాత్రలు సృష్టి లోని జీవరాశులలో కదలికని పుట్టించి వాటి దైనందిన జీవితానికి శ్రీకారం చుడతాయి. శివుడిలోని చైతన్యం ఆత్మగా రూపు దాల్చి త్రిగుణాలని (సాత్విక, రాజస, తామస) ధరించి వాటితోపాటు మనస్సు, హృదయం, బుద్ధి తోడుకాగా సకల జీవరాశులలో ప్రవేశిస్తాయి. ఈ సకల జీవరాశులు కర్మలు అనుసరించి తన్మూలంగా జీవన్మరణాలు, పునర్జన్మలతో కొట్టుమిట్టాడతాయి. జగత్తులోని స్థూల రూపంలో ఇదే సృష్టి, స్థితి, లయలుగా పేర్కొనబడతాయి.

స్థూల జగత్తులోని పంచభూతాలు, సకల జీవరాశుల నడుమ పరస్పర చర్యలకి పంచతన్మాత్రలు దోహదపడతాయి. విశ్లేషించి చూస్తే స్థూల జగత్తులోని పంచ భూతాలు కూడా పంచతన్మాత్రలతో కూడి ఉంటాయి. ఆకాశం శబ్దాన్ని, వాయువు శబ్దం, స్పర్శని, అగ్ని శబ్దం, స్పర్శతో పాటు రూపాన్ని, నీరు శబ్దం, స్పర్శ, రూపం, రుచులని, భూమి శబ్దం, స్పర్శ, రూపం, రుచి, వాసనని కలిగి ఉంటాయి. సకల జీవరాశులలో పరిణతి చెందిన జీవుడిగా మానవుడు పేర్కొనబడ్డాడు. మానవుడి పరిణతి పరిపక్వ దశని చెందిననాడు అతని మనస్సు అరిషడ్వార్గాలని త్యజించి బుద్ధిలో లీనమవుతుంది. ఆ దశలో బుద్ధి భౌతిక ప్రపంచాన్ని త్యజించి తన ఉనికికి మూలాన్ని అంతర్ముఖంగా అన్వేషిస్తుంది. ఆ అన్వేషణ ఫలితంగా బుద్ధి తన ఉనికికి మూలమైన ఆత్మని గ్రహించి దానిలో ఐక్యం చెందుతుంది. ఆ స్థితిలో ఆత్మ పరిపూర్ణంగా భౌతిక ప్రపంచం నుండి విడివడి త్రిగుణాలని పరిత్యజించి తన మూలాన్ని వెదుక్కోవటం ప్రారంభిస్తుంది. ఈ ప్రయత్నం సిద్ధించిన నాడు ఆత్మ తనకు మూలమైన చైతన్యాన్ని చేరుకుని అందులో లయమవుతుంది. ఆ సమయంలో పంచతన్మాత్రలు తాము తొలుత ఉద్భవించిన పరాశక్తిలో తిరిగి ఐక్యమవుతాయి. పరాశక్తి నిరూపిణి అయినప్పటికీ సృష్టి కార్యానికి శివశక్తులుగా రూపం ధరిస్తుందని దేవీభాగవతం చెబుతోంది. శివ శక్తులు భిన్న రూపాలు కావని అవి రెండూ ఒకటేనని లలితా సహస్రంలోని ఆఖరి నామాలు – శివ శక్త్యైక్య రూపిణి లలితాంబికా తేటతెల్లం చేస్తున్నాయి.

– డాక్టర్ బీ.యన్.వీ.పార్థసారథి

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

"అజంతా"

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని – చెన్నై



అభినవ కాళిదాసు
ఆంధ్రా షేక్స్పియర్
పానుగంటి లక్ష్మీనరసింహారావు

తెలుగు పాఠం సాగుతోంది...

వీరేశలింగం చెబుతున్న తెలుగు పాఠం అనర్గళంగా సాగుతోంది.

కందుకూరి వీరేశలింగం తెలుగు పండితుడిగా పనిచేస్తున్న రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో, తెలుగు పాఠం ఎంతో... ఎంతో... హృద్యంగా ఎంతో రసవత్తరంగా సాగుతోంది.

వీరేశలింగం తదేక దీక్షతో, మనసును, ఆత్మను, బుద్ధిని ఏకస్థం చేసి తెలుగు పాఠం చెబుతున్నాడు. అందునా అది ఆంధ్ర మహాభారతంలోని కుమార అస్త్ర విద్యా ప్రదర్శన ఘట్టం. తెలుగు భారతంలోని అందానికి, తెలుగు పద్యం యొక్క అంతరార్థానికి పొంగిపోతూ, పాఠంలో లీనమైపోయిన వీరేశలింగం హఠాత్తుగా ఆగిపోయాడు. అంత వరకూ అనర్గళంగా సాగిన ఆయన వాగ్ధార ఆగిపోగానే,

ఏం జరిగిందో అర్థంకాక, విద్యార్థులందరూ కంగారు పడిపోయారు. ఎవరికీ నోట మాట రాలేదు. భయభక్తులతో బొమ్మల్లా కూర్చుండిపోయారు. చీమ చిటుక్కు మన్నా వినిపించేంత నిశ్శబ్దం, ఆ తరగతి గదిలో ఆవరించింది. అందరూ వీరేశ లింగాన్నే చూస్తున్నారు. అయితే వీరేశలింగం దృష్టి మాత్రం కిటికీ ప్రక్కగా కూర్చుని, ఏదో ఆలోచనలో మునిగిపోయి, బాహ్యస్మృతిని మరచిపోయిన ఒక విద్యార్థిపైనే ఉంది. వీరేశలింగం ఆ విద్యార్థి వరకూ నడచివెళ్ళి ఆ విద్యార్థి ముందు నిలబడ్డాడు. అక్కడ అంత జరుగుతున్నా ఆ యువకుడు ఇంకా ఏదో ఆలోచిస్తూనే ఉన్నాడు.

వీరేశలింగం మెల్లిగా ఆ యువకుడి భుజం మీద చెయ్యివేసి, అతడ్ని కుదిపాడు. తరగతి గదిలో అదొక అద్భుతం. వీరేశలింగం, కళాశాలలో తెలుగు ఉపాధ్యాయుడే కానీ, సకల జనావళికీ ఆరాధ్యనీయుడు, సుప్రసిద్ధ సంఘ సంస్కర్త. ఎంత గొప్పవాడైనా ఆయన ముందు కూర్చొని ఉండడానికి సాహసించడు. అందుకే అక్కడున్న విద్యార్థు లందరూ సంభ్రమాశ్చర్యాలతో మునిగిపోయి, ఏం జరగబోతోందో తెలియక ఉత్సుకతతో, ఉద్వేగంతో, ఉద్విగ్న హృదయాలతో సన్నివేశాన్ని చూస్తున్నారు.

తన భుజం మీద ఎవరో చేయి పెట్టి కదపగానే, ఆ యువకుడికి బాహ్యస్మృతి వచ్చి చూశాడు. ఎదురుగా తన గురుదేవుడు మూర్తీభవించిన సంస్కార స్వరూపుడు వీరేశలింగం కనబడగానే ఒక్కక్షణం బిత్తరపోయాడు. మరుక్షణంలో ఈ లోకంలోకి వచ్చి, భయంతో, భక్తితో లేచి నిలబడ్డాడు. అతడి శరీరం కంపించిపోతోంది. అధరాలు అదిరిపోతున్నాయి. చేతులు వణికిపోతున్నాయి.

శిష్యుడ్ని పరిస్థితి చూసి, భుజం తట్టి దగ్గరకు తీసుకొన్నాడు వీరేశలింగం. నాయనా? ఏమిటయ్యా ఆలోచిస్తున్నావు? అని అడిగాడు. సంకోచిస్తూనే చెప్పాడు "గురుదేవా! నాటకం గురించి ఆలోచిస్తున్నాను" అని.

ఆ మాట వినగానే అందరూ గొల్లున నవ్వారు. తరగతి గది అంతా విద్యార్థుల హేళనా పూర్వకమైన పరిహాసాలతో ప్రతిధ్వనించి పోయింది. తోటివాళ్ళ నవ్వులు చూసి, ఆ కుర్రాడు తలదించుకొన్నాడు. అది చూసిన వీరేశలింగానికి పట్టరాని కోపం వచ్చి, ఆపండి అంటూ అరిచాడు. దేవుడు లాంటి గురువు స్వరంలో తీవ్రతకు తరగతి గదిలో తిరిగి నిశ్శబ్దం ఆవరించింది.

ఆ శిష్యుడి దించిన తలను రెండు చేతులతో పైకెత్తాడు వీరేశలింగం. నాటకం గురించి ఆలోచిస్తున్న ఆ శిష్యుడి భుజం మీద చేయివేసి, తరగతి గదిలోని వేదిక దగ్గరకు తీసుకొచ్చి, శిష్యుడ్ని వేదిక ఎక్కించి, తను క్రింద నిలబడ్డాడు. అదొక అపురూపమైన దృశ్యం. శిష్యుడు వేదికపైన, గురువు వేదిక క్రింద.

వీరేశలింగం గొంతులో ఏదో అద్భుతమైన శక్తి ప్రవేశించింది. ఆయన స్వరానికి ఏదో చెప్పలేనంత అందం ఆవరించింది.

"నాయనా! ఇప్పుడు నీవే ఈ తరగతి గదిలో ఉపాధ్యాయుడివి. నాతో సహా ఇక్కడున్న వారందరూ నీ శిష్యులే అనుకొని చెప్పు నాటకం గురించి చెప్పు, నాటకం గురించి ఎందుకు ఆలోచిస్తున్నావో చెప్పు" అంటున్న వీరేశలింగం మాటలు పూర్తి కాకుండానే, ఆ శిష్యుడు నాటకం గురించి చెప్పడం ఆరంభించాడు.

నాటకం ఎంతో గొప్పది. ఈ సృష్టి ఎంత గొప్పదో నాటకం అంత గొప్పది. ఈ విశాల సృష్టిలోని మహోన్నత, విలక్షణత, సంక్లిష్టత అద్భుతంగా స్వంతం చేసుకొన్న అపూర్వమైన సాహితీ ప్రక్రియ నాటకం. సమస్త సాహిత్య వికాసానికీ పరాకాష్ట నాటకం. సజీవమైన మానవ శక్తి యొక్క దృశ్య చిత్రణం నాటకం. ఆలోచనల్ని, అంతర్గత సంఘర్షణల్నీ, ఆర్ద్రతనూ, రసావిష్కరణనూ ఆప్యాయతనూ, అనురాగాన్నీ, ఆశా నిరాశల నిట్టూర్పుల్నీ, అంతకు మించిన ఆవేదనల అసలు రూపాన్నీ అసామాన్యంగా ఆవిష్కరించేది నాటకం. అందుకే నాటకం ఓ కళాత్మక చేతానా చిత్రం, మన జీవన రాగపు సజీవ ప్రతిబింబం.

ఇంకా... ఇంకా... ఏదో... ఏదో... వినబడుతోంది ఆ యువకుడి గొంతులో, నాటక విశిష్టత నింగికెగసింది. అతడి స్వరంలో...

అంత గొప్ప కందుకూరి వీరేశలింగం పంతులూ తన శిష్యుడి ప్రతిభ ముందు చిన్నవాడై, ఆప్యాయతతో ఆలింగనం చేసుకొని ఆశీర్వదించాడు. అదొక అద్భుత దృశ్యం.

అదొక అమృత ఘడియ.

అలా... అలా... నాటకాన్ని అంతగా ఆవిష్కరించిన ఆ యువకుడే తెలుగు సాహితీ జగత్తులో చిరస్మరణీయుడై, తెలుగు నాటకానికి వెలలేని ఆభరణాలనందించిన మహానుభావుడు ... మన పానుగంటి లక్ష్మీనరసింహారావు.

తూర్పు గోదావరి జిల్లాలోని రాజమండ్రికి సమీపంలోని సీతానగరంలో 1865వ సంవత్సరం ఫిబ్రవరి నెల 11వ తేదీన పానుగంటి లక్ష్మీనరసింహారావు జన్మించారు. ఒక సంప్రదాయబద్ధ కుటుంబంలో వేంకటరమణయ్య పంతులు, వేంకట రత్నమ్మ దంపతులకు, పూర్వజన్మ సుకృతంగా జన్మించాడు. బాల్యం సీతానగరంలో గడిచింది. గోదావరీ నది ఒడ్డున ఉన్న సీతానగరం తొలి నుండీ పానుగంటి మనసులో ఏదో తెలియని ప్రేరణ కలిగిస్తూ ఉండేది. అనుక్షణం ఆయన ఆలోచన, ధ్యాస నవ్యత వైపు పరుగులు తీసేది.

కళాశాల విద్య కోసం, రాజమహేంద్రవరం వచ్చినప్పటికి ఆయన ఓ కొత్త వాతావరణాన్ని చూశాడు. నిష్కల్మషంగా ఉన్న తన పల్లెటూరి ప్రజల్లాకాక, పట్టణంలో ఓ కొత్తకోణం ఆయనకు అడుగడుగునా కన్పించింది. ముఖ్యంగా ఆనాటి సమాజంలో కన్పించే మోసం, కుహనా వ్యక్తిత్వాలు, జుగుప్సాకరమైన అలవాట్లు, సాంఘిక దురాచారాలు... ఇలా ఒకటేమిటి... ఎన్నో... ఎన్నో... సమస్యలతో అతలాకుతలమైపోయి, అస్తవ్యస్థమైపోయిన సాంఘిక జీవనం ఒక వైపు,

దురాచారాలతో నిండిపోయిన సమాజ జీవనాన్ని సంస్కరించడానికి ఉద్భవించిన వీరేశలింగమూ మరొక వైపు పానుగంటి కంటబడ్డాయి.

దానికి తోడు అప్పుడే రాజమండ్రి వచ్చి, నాటకాలు ప్రదర్శించి వెళ్ళిన ధార్వాడ నాటక సమాజ స్మృతులు, వాటితోబాటుగా వీరేశలింగం ఆధ్వర్యంలో వెలిసిన తొలి తెలుగు నాటక సమాజం, తెలుగు నాటకాలు, ప్రహసనాలు... ఇలా ఎన్నో అంశాలు ఆ యువకుడ్ని ఒక్క పెట్టున ఆక్రమించాయి. ఎన్నో మెట్లు ఒక్క ఉదుటున ఎక్కించేలా చేశాయి.

అందుకే సంఘ సంస్కరణ లక్ష్యంతో 'సాక్షి' వ్యాసాలను, నాటక వికాసం కోసం ఎన్నో పౌరాణిక సాంఘిక నాటకాలను రచించి తెలుగు సాహితీ జగత్తును సంపన్నవంతం చేశాడు పానుగంటి లక్ష్మీనరసింహారావు. వీటన్నింటికీ తోడుగా తొలి తెలుగు నాటకంలో నటించిన రాజమండ్రి ప్రభుత్వ కళాశాల విద్యార్థులు సోమంచి భీమశంకరం, అడవికొల్లు కనకరాజులతో కూడా పానుగంటి లక్ష్మీనరసింహా రావుకు స్నేహం అయింది. ఇంకేముంది అంతవరకు నివురుగప్పిన నిప్పులా ఉన్న నాటకాభిమానంలో ఆయనలో విజృంభించింది.

రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో బిఏ పట్టం పొందాక, పానుగంటి వారికి దివాను పదవినిచ్చి గౌరవించింది లక్ష్మీనరసాపురం సంస్థానం. అంతకుముందు ఆయన ఉర్లాం సంస్థానంలో పనిచేసినా, లక్ష్మీనరసాపురంలో ఆయనకు ఎంతో గౌరవం లభించింది. నిజానికి ఇక్కడే పానుగంటి జీవితంలో అసలు నాటకం ఆరంభమైంది.

లక్ష్మీనరసాపురం జమీందారిణి రాణి చెల్లయ్యమ్మారావు. ఆమె పిఠాపురం రాజువారి పినతల్లి. ఆమెలో సాహిత్య సమార్చన, కళాసేవాభావం మెండుగా ఉండేవి. ఆ రోజుల్లో ఆమె ఒకనాడు లక్ష్మీనరసాపురం నుండి అంటే 1899వ సంవత్సరంలో కాకినాడ వెళ్ళడం తటస్థించింది. ఆ పట్టణంలో ఆరోజు కాకినాడ హిందూ నాటక సమాజం 'కీచక వధ' నాటకాన్ని ప్రదర్శిస్తోంది. ఈ హిందూ నాటక సమాజం 1885లో, అంటే భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించబడిన సంవత్సరంలోనే, కాకినాడలో స్థాపించబడింది. దినవహి హనుమంతరావు అనే సంపన్నుడు ఒకరు, ఈ సమాజాన్ని స్థాపించి, ఆ రోజుల్లో ఐదు వేలు ఖర్చు పెట్టి, తెరలు, సీనరీలు తయారు చేయించి నాటకాలు ప్రదర్శించేవారు. వెదురుమూడి శేషగిరిరావు, ముప్పిడి జగ్గరాజు వంటి మహానటులు ఈ హిందూ నాటక సమాజంలోనే గుర్తించబడ్డారు. అటువంటి నాటకం, ఆ రోజున ఆమె చెవిన పడింది. ఆ మరుసటి రోజునే ఆమె తన దివానైన పానుగంటి లక్ష్మీనరసింహారావుని పిలిచి ఎలాగైనా నాటకం వ్రాయాలని, దాన్ని పిఠాపురం కోటలో తన కుమారుడైన రాజువారి సమక్షంలో ప్రదర్శించి తీరాలని పట్టుదల పట్టింది. ఆమె ఏదైనా అనుకొంటే అది జరిగే వరకూ నిద్రపోరు. అదిగో.. అలా... పానుగంటివారి కలం నుండి వెలువడింది 'నర్మదా పురుకుత్సీ యము'. రచన బయటకు రావడం, వెంటనే పిఠాపురంలో నాటక సమాజం ఆవిర్భవించడం, 1900 సంవత్సరంలో నర్మదా పురుకుత్సీయం ప్రదర్శించబడడం, ఆ నాటకాన్ని కళ్ళారా చూసి చెల్లయ్యమ్మారావుగారి ముఖం వికసించడం వెనువెంటనే జరిగిపోయాయి.

పానుగంటి వారికి ఇంగ్లీషు సాహిత్యంలో కూడా మంచి ప్రవేశం ఉంది. సుప్రసిద్ధ ఆంగ్ల నాటక రచయితయైన విలియం షేక్ స్పియర్ దాదాపుగా 37 నాటకాలను రచించి, నాటకరంగ చరిత్రలో చిరస్మరణీయుడయ్యాడు. షేక్స్పియర్ వలే తానుకూడా ముప్పదికి పైగా నాటకాలు రచించి, తెలుగు నాటకాన్ని భాగ్య వంతం చేయాలని ఆయన ఆశ, ఆశయం. ఆ లక్ష్యంతోనే ఆయన ఎన్నో అద్భుత మైన నాటకాలను సృష్టించారు.

పౌరాణిక కథలతో వ్రాసిన నాటకాలలో తొలి నాటకం నర్మదాపురుకుత్సీయం (1900), సారంగధర (1905), రాధాకృష్ణ (1909), విప్రనారాయణ, (1909) ప్రసిద్ధమైనవి. రామాయణ మహాకావ్యాన్ని నాటకాలుగా వ్రాయాలనే బృహత్ ప్రయత్నాన్ని ఆరంభించి వారు పాదుక (1909) నాటకంతో ప్రారంభించారు. తెలుగు నాటక రంగం పైన ఆవిష్కరించబడిన తిరుగులేని దృశ్య కావ్యం పాదుక. 'చిదిమిన పాల్గారు చెక్కుటద్దములపై' అన్న పాదుకలోని పద్యం నోటికిరాని తెలుగువాడు ఆ రోజుల్లో లేడంటే అతిశయోక్తి కాదు. పశువుల కాపర్లు కూడా ఆ పద్యాన్ని ఎంతో మనోహరంగా ఆలపించేవారట. రామాయణ కథపైనే వ్రాసిన మరో నాటకం 'విజయరాఘవం' (1909) ఇంకొక నాటకం 'వనవాస రాఘవం' (1910) ఆ తరువాత ఐదేళ్ళకు మరో నాటకం, రామాయణ కథతో వ్రాసారు. అదే కళ్యాణ రాఘవం (1915).

పానుగంటివారు ఆణిముత్యాలనదగిన మూడు చారిత్రక నాటకాలు అందించారు. సుప్రసిద్ధమైన చాణక్యుడి కథలో 'ప్రచండ చాణక్యం' అనే గొప్ప నాటకాన్ని 1909లో రచించారు. ఆ తరువాత వచ్చినవే 'బుద్ధ బోధసుత' (1910) చూడామణి" (1912) నాటకాలు.

పౌరాణిక చారిత్రక నాటకాలతో పాటుగా, సాంఘికమైన ఇతివృత్తాల్ని స్వీకరించి ఆనాటి సమాజాన్ని, సామాజిక దురాచారాల్ని ప్రతిఘటిస్తూ పానుగంటి లక్ష్మీనరసింహారావు ఎన్నో సాంఘిక నాటకాలూ సృష్టించారు.

వారి సాంఘిక నాటక రచనలోకెల్లా సుప్రసిద్ధమైనది కంఠాభరణం (1917). తొలినాటి సాంఘిక నాటకాలలో గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం తరువాత, అంత గౌరవం పొందిన నాటకం ఈ కంఠాభరణమే. ఇదొక గొప్ప హాస్యనాటకం. మరి మిగిలిన సాంఘిక నాటకాలలో ప్రసిద్ధమైనవి 'కోకిల (1909) వృద్ధవివాహం (1910), పూర్ణిమ (1919), సరస్వతి (1920), వీరమతి, పద్మిని (1929), మాలతీమాల (1929), రాతిస్తంభం (1930), విచిత్రవివాహం (1930), ముద్రాక్ష (1931) వీటన్నిటికీ తోడుగా (1906)లో ఆయన హాస్యవల్లరి అనే చిన్న ప్రహసనాలను, మనో మహిమ అనే రూపకాన్ని అందించారు. ఇన్ని నాటకాలు, అందునా విభిన్నమైన ఇతివృత్తాలతో భిన్నరీతుల్లో కూడిన నాటకాలను అందించి, తెలుగు నాటక రంగాన్ని సుసంపన్నం చేసిన పానుగంటి లక్ష్మీనరసింహారావు నాటక రచనలోనూ తనదైన గొప్ప ప్రత్యేకతల్ని ప్రదర్శించారు.

వీరి నాటకాలన్నీ స్వతంత్ర రచనలు సంస్కృతం నుండి అనువాదాలు చేయలేదు. అందుకే ధర్మవరం రామకృష్ణమాచార్యులిలా, కోలాచలం శ్రీనివాస రావులా, వీరిదీ తెలుగు నాటక రంగంలో ఒక ప్రత్యేకమైన స్థానం.

నాటకంలో పాటలు అనవసరమని, పాటలవల్ల నాటక సహజత్వం చెడిపోతుం దనీ, ఒక్క భక్తిరసపోషణలో తప్ప పాటలు వద్దని, ప్రవచించి ఆచరించి చూపిన నాటకకర్త పానుగంటి. పద్యాలు కూడా సంగీతం పాడడానికికాక, కేవలం భావ ప్రకటనకు మాత్రమే ఉపయోగపడాలని మనసారా భావించారు. అందుకే ఆటవెలది, గీతము, సీసము అనే మూడు ఛందస్సులే ప్రయోగించారు. వారి నాటకాలన్నీ ఏకైక రంగాలే. రంగ విభజన మీద వారికి అంత ఆసక్తి లేదు. అన్ని నాటకాలలో సన్నివేశాలు మాత్రం అపూర్వంగా ఏర్చి కూర్చి చూపడంలో మాత్రం పానుగంటి లక్ష్మీనరసింహారావుకి సరిసములు లేరు.

'గండ'మనే ప్రయోగం వీరి నాటకాలలో విరివిగా కన్పిస్తుంది. గండమనేది మనందరి జీవితాలలో కన్పించే ఓ విశేషం. మనమందరం ఒక్కోసారి ఏదో మాట్లాడబోయి మరేదో మాట్లాడుతాం. అందులో ఏదో అపశకునం కన్పించగానే నోరు కరచుకొంటాం. ఇలా మాట్లాడే సేమేమిటి? అని ఎంతో బాధపడుతాం. దీనినే 'గండం' అంటారు. దీనికి మరో పేరు 'మూడవ పతాకస్థానం'. ఇది పలికించడం చాలా... చాలా... కష్టం. పానుగంటి వారికిది నల్లేరు మీద నడక. అతి సులువుగా పలికిస్తారు. వారి నాటక ప్రయోగంలో మరో ప్రత్యేక లక్షణం 'స్వగతం'. ఈ స్వగతం అనేది తొలుత సంస్కృత నాటకాలలో ప్రయోగించబడింది. సుప్రసిద్ధ సంస్కృత నాటక కర్త, కరుణరసపోషణలో అద్వితీయుడైన భాసమహాకవి, దీనిని ప్రయోగించినాడు.

కొద్ది మార్పులతో దానిని ఆయన 'భాణం' అన్నాడు. ఈ భాణమే, దశవిధ నాటకాలలో ఒక రూపం 'బాణం' అనేది 'భణ' అనే సంస్కృత ధాతువునుండి ఉత్పన్నమైంది. భణ అంటే మాట్లాడడం అని అర్థం. ఆంగ్ల నాటకర్త విలియం షేక్ స్పియర్ తన ఆంగ్ల నాటకాలలో ఈ స్వగతాలను ఎంతో గొప్పగా ప్రయోగించాడు. స్వగతాన్ని ఆంగ్లంలో"సాలులోక్యీ" అని పిలుస్తారు.

ఈ సాలులోక్యీ అన్న ఆంగ్ల పదం 'సాలులాక్యుమన్' అనే లాటిన్ పదం నుండి ఉద్భవించింది. సాలుస్ అంటే వంటరిగా లాకుమన్ అంటే మాట్లాడడం. అంటే ఓ పాత్ర వంటరిగా మాట్లాడడం ఇదే నేటి 'ఏకపాత్రగా' మారింది. పానుగంటి ఈ స్వగతాల ప్రయోగంలో, అనన్య సామాన్యమైన నేర్పు కన్పించాడు. పానుగంటి వారి నాటక రచనలో కన్పించే మరొక గొప్ప లక్షణం పాత్ర నిర్మాణం. వారి

నన్నభిమానించి నాలోని మంచిని ఇలా పద్య రూపంలో పంపించిన ఓ సోదరి

సోదరులు, ఆత్మీయులు, అన్నగారు శ్రీ గోటేటి వేంకటేశ్వర రావు గారికి, సోదరి ఒలేటి శశికళ, అభిమానంతో, అభినందనలతో రాసిన ఆటవెలదులు.

-ఆ.వె:-

1. పాలకొల్లు నుండి ప్రవసింప మదరాసు,
తరలి వెళ్ళె తెలుగు తరము యొకటి.
నాటి, నేటి, మేటి చాటేటి గోటేటి.
తెలుగు వనమున విరి తేరు, మేరు.

-ఆ.వె:-

2. పాండితీ ప్రకర్ష పారంపరిక మయ్యె.
పాత్రికేయు లయ్యె ప్రవృతి రీత్య.
వెయ్యి పూర్ణ చంద్ర వీక్షితులై వెల్గ,
వేంకటేశుని గన్న వేల్పు వారు.

-ఆ.వె:-

3. అమ్మయతివ లనిన యపు రూప గౌరవం,
లలిత కేలు బట్టె, లక్ష్మి మెట్టె.
శ్రీలు చిందు ముఖపు శ్రేయ దివ్యల జూడ,
దర్ప పరవశ మగు దండ్రి మనసు.

-ఆ.వె:-

4. నమ్ము నిజము తాను నడుచు నిజము నమ్మి,
నెగ్గు వాడు, తగ్గి నిలుచు వాడు.
నవ్వు విలువ దెలుసు నలుగు రున్న హితుడు,
తెరచి జూపు బ్రతుకు తెలియ తెగువ.

-ఆ.వె:-

5. ముఖ్య కార్య దర్శి, సఖ్య తెంచెడి నేత,
మాతృ భాష ప్రియుడు మాన ధనుడు.
దేశ రాజకీయ తెగులు వెలుగు దెచ్చు,
జనని, జన్మ భూమి స్వర్గ మనును.

-ఆ.వె:-

6. తన్మ యమున మురిసి దసర, దీపావళి,
సంబరాలు మనకు సందడించు.
కొండ రాయు మనువు కోరి కూరిమి జేసె,
అయ్య అండ దండ అన్న కుండ.

-ఆ.వె:-

7. చెన్న పట్నమంత చెదర వరదలకు,
కష్ట నష్టములను గాంచి నోర్చె.
దేవ దేవు దయతొ ధీమంతు, శ్రీమంతు
నాదరించు ప్రీతి, న్యాయ మీయ.

-ఆ.వె:-

8. ఆవకాయ లేమి యసలు సైపని వాడు.
స్వపర ధర్మ ములను సరిగ నెఱుపు.
హిందు ధర్మ విధులు యెందున్న మరువరు,
ప్రవచనములు యన్న ప్రాణ సమము.

-ఆ.వె:-

9. సంఘ మన్న తనదు సంసార మన్నను,
బాధ్యతెరిగి మెలుగు బాగు కోరు.
మంచి మిత్రుడు యెంచు మంచి విలువలను,
తలయివారు ఠీవి తలచి మురియు.

-ఆ.వె:-

10. తిరుపతయ్య రక్ష తీరుగా గోటేటి,
వెంకటన్న వెనుకె వెంట నుండ,
వరద రాజు గాచు వరద నష్టము నుండి,
కోట్లు పడగలెత్త కోరుచుంటి.

పాత్రలన్నీ ప్రత్యేకమైనవి. ఒక పాత్రను పోలిన మరో పాత్ర కన్పించదు.

నాటక రచనలో ముఖ్యమైనవి మూడు. ఒకటి సన్నివేశ నిర్మాణం' ఇది నాటకానికి ప్రాణం, రెండోది 'పాత్ర సృష్టి. ఇది నాటకానికి ఆత్మ. మరి మూడోది 'సంవాద కౌశలం'. ఇది నాటకానికి చైతన్యం.

ఇలా ఈ మూడింటిలో తెలుగు నాటక రంగంలో పానుగంటి లక్ష్మీనరసింహా రావు చూపిన నేర్పు అద్వితీయం. అపూర్వం. అనన్య సామాన్యం.

తెలుగు భాషా సరస్వతికి, నిఘంటువు అనే అమూల్యమైన ఆభరణాన్ని అందించిన పిఠాపురం సంస్థానంలో, శ్రీ రాజు వేంకట మహీపతి గంగాధర రామారావు బహద్దరే, పోషణలో జీవితాంతం సాహితీ సేవ చేస్తూ, నాటకంతో పాటుగా, చిరస్మరణీయమైన ఎన్నో గొప్ప వ్యాసాలను 'సాక్షి' పేరుతో అందించారు. వారికి ఆ రోజుల్లో నెలకి 120 రూపాయల జీతం. ప్రతి సంవత్సరం జరిగే దసరా ఉత్సవాలలో వార్షిక పారితోషికం నూట పదహారు రూపాయలు. దానితో సుఖంగా జీవిస్తూ, శ్రీకృష్ణదేవరాయల పోషణలోని అల్లసాని పెద్దనలా కావ్య రచన చేసి చరితార్థులయ్యారు పానుగంటి. అందుకే అవధాన సార్వభౌములైన తిరుపతి వేంకట కవులు వీరిని 'అభినవ కాళిదాసు' అని ప్రశంసించారు.

వారి గురించి ముగింపు మాటల్ని నా మాటల్లో కాకుండా గయోపాఖ్యానం వంటి జగత్ ప్రసిద్ధమైన తెలుగు నాటకాన్ని రచించిన కళాప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి మాటల్లో చెప్పడమే సమంజసంగా భావిస్తున్నాను.

28-4-1935న పానుగంటి లక్ష్మీనరసింహారావుకు పిఠాపురంలో సప్తతి పూర్తి ఉత్సవం జరిగింది. అంటే డెబ్బై సంవత్సరాల పండుగ. మహావైభవంగా జరిగిన ఆ ఉత్సవం చిలకమర్తి లక్ష్మీనరసింహం అధ్యక్షత వహించి ప్రసంగిస్తూ, 'ఈనాడు పానుగంటి లక్ష్మీనరసింహారావును' సన్మానించడమంటే ఈ తెలుగు నాటకాన్ని సన్మానించినట్లే. ఈ డెబ్బై సంవత్సరాల తెలుగు నాటకలక్ష్మిని సత్కరించినట్లే. ఈ తెలుగు సాహిత్య ప్రపంచాన్ని చేతులు జోడించి నమస్కరించినట్లే అని అంటున్నప్పుడు, అశేష ప్రేక్షక జనావళి కళ్లవెంట ఆనంద భాష్పాలు జాలువారాయిట.

ఎంత గొప్పది మన సంస్కృతి! ఎంత గొప్పది మన నాటకం!

ఎంతటి మహితాత్ములు మన నాటకరంగవిస్తరణకు కృషిచేశారో తెలిసికొను టకు ప్రయత్నించాలి.

- రసజ్ఞభారతి సౌజన్యంతో

Hotel Southern - New Delhi

Hotel Southern at New Delhi - Is the Largest South Indian Hotel, equipped with 110 rooms with modern amenities, conference hall, with a Vijayawada Restaurant located in the premises, serving the best South Indian Food and Delicacies.

The Hotel is centrally located 2.5 kms from New Delhi Railway Station and 15 kms from Domestic / International Airport.

Southern Grand - Vijayawada

Hotel Southern Grand at Vijayawada - It is a recently opened hotel with 3 star kind of modern amenities and equipped with a total of 87 rooms, conference hall and a Restaurant located in the premises, serving the best South Indian Food and Delicacies.

The Hotel is centrally located 0.5 km from Vijayawada Railway Station and 19 kms from Domestic Airport.

Complimentary : **Breakfast & Transport from Rly. Station / Airport to our Hotel, subject to prior information to our offices**

■ Bring Your Boarding Pass of Air India Airlines & Avail 10% discount on Room Tariff only

HOTEL SOUTHERN™
style. comfort. enjoy.

18/2, Arya Samaj Road,
Karol Bagh, **New Delhi.**
Tel.: 4353 2824, 2875 4210,
Fax: 011-2875 7308
e-mail: info@hotelsouthern.com

26-6-8, Papaiah Street, Opp. Registrar's Office
Gandhi Nagar, **Vijayawada**, Andhra Pradesh
Tel.: 66 77 777, 66 55 777,
Fax: 0866-257 2227
e mail: bza@hotelsouthern.com

Theater Style Upto 100 Persons

Reservations: Call 011- 4145 0200

తెలుగు చిత్రసీమలో నటుడు, సంగీత దర్శకుడు, ఎడిటర్, నిర్మాత, దర్శకునిగా

భీమవరపు నరసింహారావు బహు ప్రతిభావంతుడు!

భీమవరపు నరసింహారావు నాటకరంగం నుంచీ సినిమా రంగానికి, సంగీత దర్శకునిగా పరిచయమై అద్భుతాలు సృష్టించినవాడు. బి.ఎన్.ఆర్.గా అప్పట్లో ఓ చరిత్రనే సృష్టించిన వ్యక్తి.

నాటకరంగంపై స్త్రీ పాత్రలు ధరించే స్థానం నరసింహారావు – 'మీరజారగలడా నాయానతిసత్యాపతి – వ్రత విధాన మహిమన్' అను బహుళ ప్రచార గీతానికి భీమవరపు నరసింహారావు గారే సంగీత బాణీ కట్టారంటే చాలామంది ఆశ్చర్యపడతారు. 'శ్రీకృష్ణ తులాభారం' చిత్రంలో కూడా వారి బాణీనే అనుసరించారు. అలాగే ఆనాటి 'మాలపిల్ల' చిత్రంలోని 'నల్లవాడే గొల్లపిల్లవాడే', కొల్లాయి గట్టితేనేమీ, మా గాంధీ మాలడై తిరిగితే నేమీ, నాలుగూ పలకలా పిలక నాట్యమాడే పిలకా' – అనే పాటలు పల్లెపల్లెల్లోనూ గ్రామీణుల నోటిపై తారాడినాయంటే 'బి.ఎన్.ఆర్.'యే కారణం.

ఆయన హార్మోనియంపై రచయిత వ్రాసిన పాటలకు 'స్వరాలు' కడుతూన్నప్పుడు కదులాడే ఆ వేళ్లు నర్తనం చేస్తున్న లేడిపిల్ల పరుగుల్లా ఉండేవి. ఆ పాటలు ఎక్కడివో, ఏ తెలుగు సినిమాలోనివోకూడా ఎరుగని వారున్నారు. ప్రసిద్ధ రచయిత బసవరాజు అప్పారావు గారు ఎప్పుడో వ్రాసిన పాటల హక్కులను క్రయం చేసి, 'మాలపిల్ల' చిత్రంలో ఉపయోగించారు.

స్వరానికి సాహిత్యం కూర్చడం అనేది ఆయనకిష్టంగా ఉండేది. ప్రేక్షకుడు హాయిగా పాటను వింటున్నప్పుడు దాని భావం, అక్షరాలూ, సుస్పష్టంగా తెలియాలనేదే ఆయన దృక్పథం. ఆయన 1936 'ద్రౌపదీ వస్త్రాపహరణం' నిర్మింపబడ్తూన్నప్పుడు, ఆ చిత్ర నిర్వహణాబాధ్యతల్ని నిర్వహిస్తున్న గూడవల్లి రామబ్రహ్మంగారు. ఆ చిత్రంలోని పద్యాలకు బి.ఎన్.ఆర్. చేతనే స్వరకల్పన చేయించారు. అలా ఆయన సినిమారంగ ప్రవేశం చేశారు.

ఆ చిత్రంలోని కృష్ణ పాత్రధారి ప్రముఖ నాటక, సినిమా నటుడైన సి.యస్.ఆర్. ఆంజనేయులు పాడిన 'ఏల ఈ లీల బేలా' అను పాట చిత్రానికే విజయం కూర్చింది. పద్యంలోని ఒక్కొక్క అక్షరం పొందికగా వినిపిస్తూ, స్వరం కూర్చిన తీరు – పౌరాణిక చిత్రాలకే కాదు, నటులకూ, సంగీతానికి మంచి విలువ తెచ్చింది. చిత్ర రంగ పాటల కూర్పులో ఆయన అప్పటివరకూగల నాటకరంగ బాణీనే మార్చివేశారు. రచయిత కూర్చిన పదాలకు అనువుగా, పదాలను విరపకుండా స్వరమోహనుల్ని సొంపు చేసిన విధానంలో బి.ఎన్.ఆర్. తన ప్రత్యేకతను నిలుపుకున్నారు.



రైతుబిడ్డలో బి.ఎన్.ఆర్

ఆయనేమైనా, ఏ గురువు వద్దనైనా సంగీతం నేర్చుకున్నారా అంటే లేదు. పోనీ హార్మోనియం వాయించడమైనా నేర్చుకున్నారా – అంటే అదీ లేదు. హార్మోనియం వాయించాలనెడి అభిలాష కలిగింది. అంతే హార్మోనియం 'రీళ్లు' పట్టుకుని, సరిగమపదనిసల క్రమం తెలియకుండా అవలీలగా వాయిస్తూ అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఆయన కూర్చినవన్నీ స్వంత బాణీలే! ఎవరైనా నిర్మాత ప్రచారంలో ఉన్న హిందీ పాటల బాణీలో స్వరాలను అనుకరించమన్నప్పుడు – దానికి సంగీత దర్శకునిగా నేనెందుకు అంటూ సున్నితంగా తిరస్కరించిన చిత్రాలెన్నో ఉన్నాయని విన్నాను.

ఆయన సినిమా రంగంలో ప్రవేశించి పద్యాలు కూర్చిన తొలి చిత్రం 'ద్రౌపదీ వస్త్రాపహరణం' అయితే, చివరిగా 1958 సం॥ములో సంగీతం కూర్చిన ప్రతిభా వారి 'దొంగలున్నారు జాగ్రత్త' చిత్రం. ఇందు జగ్గయ్య, జి. వరలక్ష్మి ప్రధాన పాత్రధారులు.

ఈమధ్యకాలంలో దర్శకుడు పి. పుల్లయ్యతో కలిసి రాగిణీ ఫిలిమ్స్ నిర్మాణ సంస్థను స్థాపించి 'భక్తజన', 'తిరుగుబాటు', ధర్మదేవత', 'అర్థాంగి' చిత్రాల్లో భాగస్వామ్యంతో సంగీత దర్శకునిగా పనిచేశారు.

'అర్థాంగి' చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి నాయకులు. కథాపరంగానూ, సంగీతపరంగానూ ఈ చిత్రం మంచి పేరు తెచ్చుకున్నది.

నటునిగా కూడా బి.ఎన్.ఆర్. మంచి పాత్రలే ధరించారు. కొంతకాలం స్వంతంగా నాటక కంపెనీని నెలకొల్పి తాను నటుడు, సంగీత దర్శకునిగా ద్విపాత్రాభినయం చేశారు. గురువు లేకుండా కర్ణాటక సంగీతంతోబాటు, హిందుస్థానీ సంగీతంలో ప్రావీణ్యం సంపాదించిన బి.ఎన్.ఆర్. (భీమవరపు నరసింహారావు) సమునిగా ఇంతవరకూ చిత్రరంగంలో మరొకరు పుట్టలేదు. తరతరాల సినిమాకు తరగని సంపదనొసగిన కళాకారుడాయన. కొంతకాలం సినిమా పరిశ్రమ నుంచి తానుగా వైదొలగి 72వ యేట కన్నుమూశారు. ●

తెలుగు దీప్తి

అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వ
విద్యాలయాలు స్థాపించునాడు
ఓరుగల్లున రాజవీర లాంఛనముగా
పలు శస్త్రశాలలు నిలుపునాడు
విద్యానగర రాజవీథుల కవితకు
పెండ్లి పందిళ్లు కప్పించునాడు
పొట్నూరికి సమీపమున ఆంధ్ర సామ్రాజ్య
దిగ్జయ స్తంభ మెత్తించునాడు
ఆంధ్ర సంతతికే మహితాభిమాన
దివ్యదీక్షాసుఖస్ఫూర్తి తీవరించె
నామహావేశ మర్థించి ఆంధ్రులార
చల్లుదాంధ్ర లోకమున నక్షతలు నేడు.

– రాయప్రోలు సుబ్బారావు

ప్రసిద్ధాలయం :

మహానంది

కర్నూలు జిల్లాలో నంద్యాలకు 16 కి.మీ. దూరంలో, అరణ్యమధ్యంలో నల్లమల కొండలలో ఉన్న మహానంది క్షేత్రంలో మహానందీశ్వరాలయం ఉంది. ఈ దేవాలయంలోని శివలింగం శ్రీశైల మల్లికార్జునస్వామి శివలింగాన్ని చుట్టిన ఉపలింగాల్లో ఒకటని చెప్పబడుతోంది. ఇక్కడ ఒక జలధార శివలింగం క్రిందుగా ప్రవహించి, అక్కడే జలకుండంలో ఉన్న నంది ముఖం నుంచి వెలువడుతోంది. ఈ జలకుండంలో ఉన్న జలం ఎప్పుడూ స్వచ్ఛంగా ఉంటుంది. ఈ క్షేత్రం చుట్టూ మంటపాలతో ఆవరించి ఉంది.

మహానంది క్షేత్రం గురించి విజయనగర కాజుల కాలంనాటి రాగిరేకుల శాసనంలో చెప్పబడింది. శ్రీకృష్ణదేవరాయలు ఈ ఆలయానికి అనేక కానుకలు సమర్పించాడట! ఈ ఆలయం బాదామీ చాళుక్యుల కాలంలో నిర్మించబడినట్లు చెప్పబడుతోంది.

ఇక్కడి దేవుడి కెదురుగా పెద్ద నంది ఉండడంవల్ల దీనికి 'మహానంది' క్షేత్రం అన్న పేరు వచ్చి ఉంటుంది.

ప్రధాన ఆలయం చుట్టూ పెద్దపెద్ద రాళ్లను పేర్చి కట్టిన ప్రాకారం ఉంది. ఇక్కడి ఆలయ పశ్చిమ దిశల్లో ప్రవేశద్వారం, దానిమీద గోపురం ఉన్నాయి. ఉత్తర, దక్షిణ దిశల్లో కూడ ద్వారాలు, వాటిమీద గోపురాలు ఉన్నాయి. ప్రహరీ గోడకు లోపల, వెలుపల వైపున ఆలయం చుట్టూ స్తంభాలతో నిర్మించబడ్డ 'తిరుమల రాయ మండపం' అనే విశాల మండపం ఉంది. ఆలయంలో ప్రవేశించగానే ముఖద్వారానికి ఎదురుగా ఒక కోనేరు ఉంది. ప్రధాన ఆలయంలో ముఖమండపం, అంతరాళం, గర్భగృహం ఉన్నాయి. గర్భగృహానికి ఉత్తర, దక్షిణ దిశల్లో రెండు చిన్న మందిరాలు ఉన్నాయి. అంతరాళానికీ, గర్భగుడికీ మధ్య 14 స్తంభాలతో నిర్మించబడ్డ దీర్ఘచతురస్రాకార మండపం ఉంది. గర్భగృహం మీద వేసర జాతిలో నిర్మించబడ్డ చాళుక్యుల కాలానికి చెందిన నాలుగు అంతస్తుల విమానం, అగ్రభాగంలో అమలక శిఖరం, శిఖరం మీద కలశం ఉన్నాయి. దీన్ని రససిద్ధుడనే శిల్పి నిర్మించాడట. గర్భాలయంలో పుట్ట ఆకృతిలో ఉన్న దిబ్బ మధ్యభాగంలో స్వయంభూలింగ మనబడే మహానందీశ్వరస్వామి లింగం ఉంది. లింగం పై భాగంలో ఆవు గిట్టలను పోలిన రంధ్రాలు ఉన్నాయి. ఈ శివలింగాన్ని ఎవరైనా తాకవచ్చు.

ప్రధానాలయానికి దక్షిణ భాగంలో పార్వతీదేవి ఆలయం ఉంది. ఈ ఆలయం గర్భగృహం, అంతరాళం, ముఖమంటపాలతో కూడుకొని ఉంది. గర్భగృహంలో దేవీ విగ్రహం ప్రతిష్ఠించబడి ఉంది. ఈ ఆలయం చేరువలోనే రామాలయం, నటరాజస్వామి ఆలయాలు ఉన్నాయి.

మహానందికి 10 కి.మీ. చుట్టుప్రక్కల మరి తొమ్మిది నంది దేవాలయాలున్నాయి. అవి:- 1. పద్మ నంది, 2. నాగ నంది, 3. వినాయక నంది, 4. గరుడ నంది, 5. బ్రహ్మ నంది, 6. సూర్య నంది, 7. విష్ణు నంది, 8. సోమ నంది, 9. శివ నంది, సూర్యాస్తమయంలోగా ఒక్కరోజులోనే ఈ నవ నందులను దర్శించాలన్న ఒక విశ్వాసం ప్రబలంగా ఉంది.

మహాశివరాత్రి పర్వదినం నాడు (మాఘ బహుళ చతుర్దశి) ఉత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా ఏకాదశ రుద్రాభిషేకం, కళ్యాణోత్సవం, రథోత్సవం, తెప్పోత్సవం, వసంతోత్సవం వైభవంగా జరుగుతాయి. శ్రీశైలం దర్శించే యాత్రికులు సాధారణంగా ఈ క్షేత్రాన్ని సందర్శిస్తారు. మహానంది యాత్రాస్థలంగానే కాకుండా విహారయాత్రాస్థలంగానూ ప్రసిద్ధి చెందింది. ఇక్కడి సుందర ప్రకృతి అందరినీ ఆకర్షిస్తుంది. యాత్రికులకు ఇక్కడ వసతి సౌకర్యాలు ఉన్నాయి.

– డా॥ జి.యస్. మోహన్

భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది

అంబికా దర్బార్‌బత్తి

త్రిమతాచార్యుల్లోని మరో మహనీయుడు మధ్వాచార్యులు!

భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతీ పునరుద్ధరణకు పూనుకున్న త్రిమూర్తులనదగిన త్రిమతాచార్యుల్లో మధ్వాచార్యులు మూడవ వారు. విచిత్రమేమంటే మొదటివారైన ఆదిశంకర భగవత్పాదులు కేరళ రాష్ట్రంలోని కాలాడిలో జన్మిస్తే, విశిష్టాద్వైత మతాచార్యులైన రామానుజాచార్యులు వారు తమిళనాడులోని శ్రీ పెరంబూర్‌లో జన్మించారు. మూడవవారైన మధ్వాచార్యులు వారు కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపిలో జన్మించారు. ఈ ముగ్గురూ ముష్కరుల దండయాత్రల్తో, వారి వారి పాలనల్తో భ్రష్టుపట్టిపోతున్న భారతీయ సనాతన ధర్మాన్ని పునరుద్ధరించిన మహానుభావులు, వీరే.

ధర్మాచరణకు దారిచూపిన భారతీయత అనబడే హిందూ ధర్మాన్ని ముగ్గురూ మూడు మార్గాల్లో బోధించినప్పటికినీ హైందవ ధర్మాన్ని కాపాడారు. ఆవిద్య, అభద్రతల కారణంగా, క్రైస్తవం, ఇస్లాము మతాల్లోకి పోయే వలసల్ని – నిజమైన ధర్మమార్గం, విశ్వశాంతి, హిందూ మతంలోనే ఉన్నదనీ – ఇతర మతాల్లో జనుల పాపిష్టితనాన్ని, ఆయా మతాల కర్తలు క్రీస్తు, మహ్మద్ క్షాళనం చేస్తారన్నది తప్పుడు మార్గమని చెప్పకుండా, మనషి పాపికాడనీ, మనిషిలోని అంతరాత్మలో దేవుడు ఉన్నాడనీ, ధర్మమార్గంలో, సత్యపథాన పయనించే వారిని దేవుడే రక్షిస్తాడనీ, విశ్వంలోని సకల జనులూ సన్మార్గంలో పయనిస్తూ, సుఖశాన్తులు బడయగలరనీ బోధించినది ఈ త్రిమతాచార్యులే! భారత సాంప్రదాయం అంటే విశ్వశాంతి, విశ్వ జనుల సుఖం, విశ్వజనుల క్షేమం, విశ్వసమైక్యతే! మనుషుల్లోనే కాదు సకల ప్రాణుల్లోనూ భగవంతుడున్నాడనీ, సకల జీవరాశులూ ప్రేమింపదగినవేనన్నది కూడా సనాతనధర్మమే! ప్రహ్లాదునిచే **'ఇందు కలడందు లేదని సందేహం వలదు, చక్రి సర్వోపగతుడని'** చెప్పించిందీ, విగ్రహారాధన కారణంగా మనఃశ్శాంతి లభిస్తుందని అన్నదీ హిందూ ధర్మమే! ఎవరికి యిష్టమైన దైవాన్ని వారు ఆరాధించవచ్చని 'సర్వనమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి' అన్నది హిందూమతాచార్యులూ, హైందవ ధర్మమే!



మధ్వాచార్యులువారు జన్మించింది కర్ణాటక రాష్ట్రం లోని ఉడిపి యని ఆదిలోనే చెప్పుకున్నాం. ఆయనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు వాసుదేవుడు. చిన్ననాటినుంచీ వాసుదేవునికి దైవభక్తి ఎక్కువ. తోటి పిల్లలు ఆడుకుంటుంటే వాసుదేవుడు మాత్రం ఆసక్తి కనబరచకుండా పెద్దవాళ్లు జరిపే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనేవారు. ఈ శ్రద్ధ, ఈ ఆసక్తి తల్లిదండ్రులకు ఆశ్చర్యం కల్గించినా, ఆసక్తి, భక్తి శ్రద్ధలను జూచి పదకొండేండ్ల వయసులోనే సన్యాసదీక్షను ఇప్పించారు. సన్యాసదీక్ష నిచ్చిన గురువు వాసుదేవుని పేరును మార్చి 'పురాణప్రజ్ఞ' అనే నామకరణమును చేశారు. గురువు యిచ్చిన పేరుకు తగ్గట్టు ఆయన దీక్షను తీసుకున్న నెలరోజుల్లోనే 'తర్కం'లో దిగ్గజాలైన పండితుల్ని ఓడించారు. ఇవ్విషయం రాష్ట్రంలో ప్రచారమై, ఆయన పేరు ప్రఖ్యాతుల్ని కల్గించాయ్. వేదాలూ శాస్త్రాల్లో ఉన్న విషయాలను సులభంగా గ్రహించి, సుస్సులభంగా బోధిస్తూండడంలో ఆయన ఖ్యాతి వ్యాప్తినొందింది. పట్టుమని పదిహేను సంవత్సరాలు వయసు నిండకుండానే ఆయన భారతదేశయాత్రను ప్రారంభించారు. ఆ యాత్ర దిగ్విజయ యాత్రగా సాగింది. ఆయన ప్రసంగాలు వినడానికి జనులు తండోపతండాలుగా వచ్చేవారు. ఆధ్యాత్మికతకూ మూఢ విశ్వాసాలకు మధ్య అగాధం ఉందని విమర్శలు చేసేవారు సంచలనం సృష్టించారు. పైగా ఆరోజుల్లో మతసామరస్యం తక్కువగా ఉండెడిది. వివిధ మతాల మధ్య తీవ్రమైన విభేదాలుండేవి. రకరకాల వాదాలుండేవి. వీటన్నిటికీ భిన్నంగా ప్రవచించే యదార్థవాదానికి విస్తృత ప్రచారం లభించింది. అయినా విమర్శించే ఛాందసవాదులు పెరిగారు. అయినా వీటిని పట్టించుకోకుండా ఆచార్య నామధేయ గౌరవమిచ్చి, మధ్వాచార్యగా పిలుస్తూండేవారు. తన యాత్ర ముగించుకున్న తరువాత భగవద్గీతకు చక్కని వ్యాఖ్యానం వ్రాశారు. అప్పటివరకూ దక్షిణ భారతంలోనే దిగ్విజయ యాత్ర చేసిన మధ్వాచార్యులవారు ఉత్తరదేశ యాత్రకు బయలుదేరారు. హిందువుల పుణ్యక్షేత్రమైన బదరీ క్షేత్రంలో మండలం రోజులు ఉపవాస దీక్షను సలిపారు. ఆ సమయంలోనే మధ్వాచార్యులు వారు వేదవ్యాసుణ్ణి దర్శించారని, గీతాభాష్యాన్ని ఆయనకు చూపించారని కొందరు గ్రంథకర్తలు వాక్రుచ్చారు. బదరీ నుంచి తిరిగివచ్చిన తరువాత బ్రహ్మసూత్రాలకు భాష్యం వ్రాయదొడగారు. మధ్వాచార్యులు వ్రాసిన గీతాభాష్యానికి దేశవ్యాప్తంగా విశేష స్పందన లభించింది. శిష్యబృందం పెరిగింది. ఆయనకు ఉడిపి పశ్చిమ భాగమునగల సాగరంలో శ్రీకృష్ణుడి విగ్రహం దొరికింది. అద్దానిని అక్కడే ప్రతిష్ఠించిన మధ్వాచార్యులు మరల ఉత్తరదేశ యాత్రకు బయల్దేరారు. అక్కడ గంగానదీ తీరములో ముస్లిము రాజు సైనికులు పట్టుకుని నిలబెట్టగా నవాబు ఎదుట ఎటువంటి భీతీ లేకుండా నిలబడడం జూచి – నవాబు 'నీకు ఏవిధమైన భయమూ అనిపించడం లేదా? అని ప్రశ్నించగా – ఈ సకల ప్రపంచాన్ని నడిపించే నాథుడు భగవంతుడు ఒకడే! ఆయనకే భయపడని నేను మీకెందుకు భయపడాలి' అని తిరిగి ప్రశ్నించాడు. ఈ ధైర్య వచనాన్ని మెచ్చి నవాబు మధ్వాచార్యునికి కొన్ని బహుమతులు యిచ్చారు. ఆ బహుమతులను అక్కడే విడిచి ఉడిపికి తిరిగి వస్తూ కాశీ విశ్వనాథుణ్ణి దర్శించారు. కురుక్షేత్ర సంగ్రామ ప్రదేశం దర్శించారు. ఉడిపికి తిరిగివచ్చిన మధ్వాచార్యునికి ప్రజలు బ్రహ్మరథం పట్టినట్టుగ స్వాగతం పలికారు. అయినా కొందరు ఛాందసవాదుల వ్యతిరేకత తగ్గలేదు. మధ్వాచార్యులు రచించిన గ్రంథాలను తస్కరించారు. ఆ ఛాందస పండితులతో వాదానికి సిద్ధమని, వారందర్నీ తర్కంతో ఓడించారు. తరువాత తన సోదరుడు విష్ణువర్ధనుని తన ఆశ్రమంలో చేర్చుకోవడమే గాకుండా, అనేకానేకమంది శిష్యులకు సన్యాసదీక్షనిచ్చి, తరువాత 79 సం॥ములో బదరీక్షేత్రం వెళ్లి అక్కడనే పరమపదించారు. జీవించినన్నాళ్లూ ఓటమి ఎరుంగని యదార్థవాదిగా పేరుప్రఖ్యాతులందిన మధ్వాచార్యులు వారు హిందూ మతోద్ధరణ చేసిన త్రిమతాచార్యులో ఒకరిగా నిలిచిపోయారు. ●

'అఖండ భూమండలాచార్యులు' శ్రీమద్వల్లభాచార్యులు!

"అధరం మధురం, వదనం మధురం, నయనం మధురం హసితం మధురం, హృదయం మధురం, గమనం మధురం, మధురాధిపతే అఖిలం మధురం" అన్న మధు రాష్ట్రాన్ని తన జీవితంలో ఒక్కసారైనా తెలుగువారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో! అయితే ఈ మధురాష్టకాన్ని వ్రాసిన వైష్ణవాచార్యులు, మహాజ్ఞాని అయిన శ్రీ వల్లభాచార్యుల గురించి మాత్రం చాలామందికి తెలియదు. ఈ వ్యాసంలో వారిని గురించిన విశేషాలను తెలుసుకుందాము.

జగద్గురువు శ్రీ వల్లభాచార్యుల వారు భారతదేశంలో ప్రఖ్యాతిగాంచిన నలుగురు ఆచార్యులలో ఒకరు. నలుగురు ఆచార్యులలో 15వ శతాబ్దంలో, ఆంధ్రదేశానికి చెందిన ఆచార్యులు వీరొక్కరే! శ్రీ వల్లభాచార్య ముని జన్మతః తెలుగు బ్రాహ్మణులు, చైతన్య మహాప్రభువుకు సమకాలీకులు. వీరిని అగ్ని దేవుడి అవతారంగా భావిస్తారు. రాజస్థాన్, గుజరాత్ లలో వైష్ణవ మతాన్ని వీరే స్థాపించారు. వీరు గొప్ప పండితులు, దీవింపబడిన మేధావి. శుద్ధాద్వైతమును, పుష్టి మార్గమును సిద్ధాంతీకరించారు. వారు పుట్టినప్పుడు ఒక అద్భుతం జరిగిందట... అదేమిటంటే,

అగ్నికీలలే రక్ష

శ్రీమద్వల్లభాచార్య మహా ప్రభువులు తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో శ్రీ లక్ష్మణభట్టు గారు, ఎల్లమ్మ గారు అనే దంపతులకు జన్మించారు. వారి ఇంటిపేరు కంభంపాటివారు. కాశీ నగరాన్ని తమ నివాస స్థానంగా చేసుకున్న ఈ దంపతులు, ఆ నగరంపై మహమ్మదీయులు దాడి చేస్తున్నారు అన్న వార్తను విని స్వస్థానానికి బయలుదేరారు. అప్పటికి నిండు చూలాలయిన ఎల్లమ్మ గారు, మార్గమధ్యంలో, చంపారణ్యంలో ఒక స్పృహలేని మగ శిశువును కన్నారు. బిడ్డ బ్రతికి లేడని అతనిని ఆకులలో చుట్టి, ఒక జమ్మి చెట్టు తొర్రలో దాచి, వారు ముందుకు ప్రయాణం సాగించారు. కానీ ఆ రాత్రి బిడ్డ బ్రతికే ఉన్నట్టు ఎల్లమ్మ గారికి కల వచ్చింది. వెంటనే వారు వెనక్కి వెళ్లి చూడగా శిశువు కదులుతున్నాడు, అతడి చుట్టూ అగ్నికీలలు వెలుగుతూ అతనిని కాపాడుతున్నాయి. అందుకే ఆ బిడ్డ అగ్నిదేవుని అంశావతారమని అందరూ భావించారు. వారా బిడ్డను తీసుకుని, ఆనందంగా ముందుకు ప్రయాణం కొనసాగించారు. అలా వైశాఖ బహుళ ఏకాదశి నాడు, ఆచార్యుల వారు జన్మించారు. కొన్నాళ్ళకు మహమ్మదీయులు కాశీ పై దండెత్తకుండా వెనక్కి తిరిగి పోవడంతో ఆ కుటుంబం తిరిగి కాశీకి చేరింది.

ఆచార్యుల వారు మహాజ్ఞాని. 11వ ఏటనే సకల శాస్త్ర పారంగతులయ్యారు. బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు, భగవద్గీత, శ్రీ మద్భాగవతము వీటి ప్రాతిపదికపై ఆచార్యులవారు "శుద్ధాద్వైతము" అనే సిద్ధాంతాన్ని ప్రబోధించారు. 11వ ఏటనే దివ్య క్షేత్ర సందర్శన యాత్రను ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా ఇటువంటి దిగ్విజయ యాత్రలను ఆచార్యులవారు మూడుసార్లు చేశారు. 'పూరి' రాజు గారి సమక్షంలో జరిగిన బ్రహ్మ తత్వం వాదములు ఆచార్యుల వారు తమ శుద్ధాద్వైత సిద్ధాంతాన్ని విజయవంతంగా నిర్ధారణ చేసారు. కానీ పండితులు ఈ బాలుని సిద్ధాంతాన్ని అంగీకరించడానికి నిరాకరించారు. అప్పుడు అందరి సమాధానాలు ఒక పత్రము పై వ్రాసి, ఒక తాళ పత్రము, ఘంటము పూరిలోని శ్రీ జగన్నాథ స్వామి వారి సన్నిధిలో రాత్రి ఉంచి, ఉదయం తలుపులు తెరువగా, ఆచార్యులవారిచ్చిన సమాధానమే సరైనదని వ్రాసి ఉన్నది. ఆ తరువాత తన యాత్రను కొనసాగించిన ఆచార్యులవారు ఓర్చా నగరంలో ఉద్దండ పండితుడు, సరస్వతీ ఉపాసకుడు, అయిన ఒక తాంత్రికవేత్తను ఓడించి, ఓర్చా రాజు గారిచే కనకాభిషేకం చేయించుకున్నారు. ఆ తరువాత వ్రజ భూమిలో ఆశ్రమాన్ని నిర్మించుకుని, నిత్యము భాగవతపారాయణ చేస్తూ, ప్రవచనములు, చెబుతూ ఉండగా, శ్రావణ శుద్ధ ఏకాదశి నాడు, అర్ధరాత్రి సమయంలో, సాక్షాత్తు శ్రీకృష్ణుడు అనుగ్రహించి వారికి 'బ్రహ్మసంబంధ దీక్ష' ను ఇచ్చారు. ఆ తరువాత విజయ నగర సామ్రాజ్యం లో ఆచార్యుల వారు సిద్ధాంత చర్చలో అందరినీ ఓడించగా, రాజుగారు సంతోషించి, 'అఖండ భూమండలాచార్యులు' అనే బిరుదును ప్రదానం చేసి కనకాభిషేకం చేశారు. ఆ తరువాత ఆచార్యులవారు జార్ఖండ్లోని గోవర్ధనగిరి చేరి, అక్కడ భగవానుని ఆజ్ఞపై, ఒక చిన్న మందిరాన్ని నిర్మించి, కొన్నాళ్లు అక్కడ నివసించారు. ఆ తరువాత పండరీపురము విఠల భగవానుని సేవిస్తూ ఉండగా, విఠలుడు ఆయనను వివాహం చేసుకోమని ఆజ్ఞాపించారు. అప్పుడు ఆచార్యులవారు కాశి తిరిగి వచ్చి 'మహాలక్ష్మి' అనే కన్యను వివాహం చేసుకుని, అక్కడే ఉండిపోయారు. వారికి శ్రీగోపీనాథులు, శ్రీవిఠ్ఠలనాథులు అనే ఇద్దరు కుమారులు కలిగారు. వీరిరువురు మహాపండితులు. రాజస్థాన్, గుజరాత్లలో ఆచార్యులవారి సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు.

శుద్ధాద్వైతము - పుష్టి మార్గము:

శ్రీమద్వల్లభాచార్యుల వారు తమ శుద్ధాద్వైత సిద్ధాంత నిరూపణకు, పుష్టిమార్గ బోధనకు, ప్రస్థానత్రయంతో పాటు భాగవతాన్ని ప్రమాణ గ్రంథంగా ఎన్నుకున్నారు.

సాకారనిరాకార బ్రహ్మములుగా చెప్పబడే రెండు స్వరూపాలు, పరబ్రహ్మ అయిన శ్రీకృష్ణపరమాత్ముడే. ఆయనకు వేరుగా ఏదీ లేదు. ఈ చరాచర జగత్తంతా ఆవరించియున్న పరమాత్మను గురించి జ్ఞానము కలిగించి, భక్తిని వృద్ధి పొందించేదే శుద్ధాద్వైత మార్గము.

పుష్టి అంటే అనుగ్రహము, పోషణము. భగవానుడు ప్రభువు, తన సేవకుడిని అనే సంపూర్ణ భావంతో తాను పొందిన మంత్రోపదేశాన్ని అనుసంధానం చేస్తూ, త్రికరణ శుద్ధిగా భగవత్సేవకు అంకితమవడమే పుష్టిభక్తి మార్గము. ఈ మార్గాన్ని అవలంబించేవారు సన్యాసము స్వీకరించనక్కర్లేదు. గురువు నుంచి బ్రహ్మ సంబంధ దీక్షను పొంది, తనకున్నవన్నీ భగవానునివే అన్న భావనతో ఉంటూ, దైవానికి నివేదించిన ప్రసాదాన్ని మాత్రమే భుజిస్తూ, వీరు అన్ని విధాలా భగవంతుని సేవిస్తూ ఉంటారు.

ఆచార్యులవారి రచనలు:

ఆచార్యులవారు బ్రహ్మసూత్రాలకు, ఉపనిషత్తులకు, భగవద్గీతకు శుద్ధాద్వైత సిద్ధాంతానికి అనుగుణంగా భాష్యం వ్రాశారు. అనేక స్వతంత్ర గ్రంథాలు వ్రాశారు. వీటిలో శ్రీపురుషోత్తమనామ సహస్రము, శ్రీసుబోధిని భాష్యము, షోడశ గ్రంథాలు ముఖ్యమైనవి. తెలుగులో కూడా వీరు ఒక గ్రంథాన్ని రచించినట్లు చెబుతారు.

పురుషోత్తమ నామ సహస్రము:

శ్రీమద్భాగవతం లోని పన్నెండు స్కంధాలలోను వర్ణింపబడ్డ భగవల్లీలలను గూర్చి, 1075 లీలానామాలతో(256 అనుష్టుప్ శ్లోకాలతో) "శ్రీ పురుషోత్తమ నామ సహస్రము" అనే పేరుతో ఆచార్యులవారు గ్రంథ రచన చేశారు. ఈ నామాల అర్థాలు తెలుసుకుని, ఈ గ్రంథ పఠనం చేస్తే, శ్రీమద్భాగవత పఠనమవుతుం దని శ్రీ ఆచార్యులవారు ఆదేశము.

మహాత్ముల ప్రశంసలు... సాయి నాధుని గురించి

1. శ్రీ కంచి చంద్రశేఖరేంద్ర సరస్వతి- సాయి సాక్షాత్తు దత్త త్రేయులు.
2. చెందోలు రాఘవ నారాయణ శాస్త్రి గారు- సాయి పూర్ణ దత్తవతారం.
3. శ్రీ రామ శరణు గారు- సాయి సాక్షాత్తు రాముడే
4. మెహర్ బాబా- ప్రపంచంలో వివిధ మతాలకు చెందిన మహాత్ముల కూటమికి సామ్రాట్ సాయి నాధుడు
5. శ్రీ ఆక్మల్ కోట మహారాజ్ - నా కార్యం ఇక సాయి రూపంలో జరుగుతుంది.
6. మాధవనాధ్ మహరాజ్-సాయి సామాన్య సత్ పురుషులు కాదు, మహనీయులలో కోహినూర్ వజ్రం వంటి వారు
7. శ్రీ కులకర్ణి మహారాజ్- యోగ స్థాయిలో ఉన్న నిన్ను ఉద్ధరించ గలవారు సాయి నాధుడు ఒక్కరే. ఉపసినీ మహారాజ్ తో
8. మెహర్ బాబా- సాయి అంటే ఆధ్యాత్మిక పరిపూర్ణత ఆయన రూపంలో వెలిసింది. సాయి సృష్టి అంతటికీ గురువు.
9. రమణ మహర్షి- సైగలతో నేను, ఆయన ఒక్కటే (మరకతమ్మ గారితో)
10. గోపాల్ స్వామి- సాయి భగవాన్ హై
11. శ్రీ గణపతి సచ్చిదానంద -సాయి అంటే దత్త త్రేయులు,
12. స్వామి శివా నంద-(ఋషికేష్) సాయి అంటే ఆనంద సాగరం.
13. శంబునాధ్ మహారాజ్- నిధులన్నింటికి నిధి సాయి.
14. నారాయణ మహారాజ్(ఖేడ్ గావ్ భేట)- సాయి అందరికి పరమ గురువు.
15. వాసుదేవనంద సరస్వతి-దాసగణుతో సాయి నాధుడు మా పెద్ద అన్న గారు మమ్మల్ని కనిపెట్టి ఉండమనండి
16. అనసూయ మాత- సాయి సాక్షాత్తు ఋషి.
17. బ్రాహ్మ చారి బాబా - సాయి నాధుడు సత్ బ్రాహ్మణుడు.
18. ధుని వాలా దాదా- వారు దత్త స్వరూపం,
19. గణేష్ పురి నిత్యా నంద మహారాజ్- వారు పూర్ణ దత్త త్రేయులు
20. గుణవణి మహారాజ్-సాయి దత్త త్రేయులు
21. రామకృష్ణ పరమహంస-వారిని చూడటం వలన తీవ్ర మైన భక్తి కలుగుతుంది.
22. శ్రీ రంగన్న బాబు గారు-రాముల వారు ఆ రూపంలో వున్నారు.
23. శ్రీ దత్త మహారాజ్(పుణే)-కుసాభావు తో నిన్నుఁ ఉదరించ గలవారు సాయి నాధుడు మాత్రమే.
24. దాజి మహారాజ్- వారు మారుతి అవతారం.
25. జానకి దాస్ మహారాజ్- సాయి గొప్ప మహనీయులు.
26. శ్రీ కేశవానందాజీ మహారాజ్- సాయి దత్తులే.
27. శ్రీ గురూ సిద్ధ రూఢస్వామి - సాయి సాక్షాత్తు దత్తులే.
28. గంగఫిర్ మహారాజ్-సాయి ఆధ్యాత్మిక ఉన్నత సింహాలను, ఏనుగులను శాసించగలరు.
29. శ్రీ గాడ్గి మహారాజ్- సాయి సమర్థుడు అయిన సద్గురువు.
30. కిల్వ న్ స్వామి- సాయి మహాశక్తి స్వరూపం, సాక్షాత్తు భగవంతుడు, బ్రాహ్మచారి.
31. అవధూత రమి రెడ్డి తాత-మన నాయన, అందరికి నాయనా సాయి.
33. అవధూత వెంకయ్య స్వామి- వారు మా పెద్దన్నగారు.
34. ఆనందమయి అమ్మ- వారు జ్ఞాన స్వరూపం, వారిని నమ్మితే ఏలాంటి సాధన పెద్దగా అవసరం లేదు.
35. హరి హర మహారాజ్- శ్రీ సాయి ఉచ్ఛ కోటి లోని మహాత్ములు.
36. శ్రీ ఆనంద స్వామి- సాయి సామాన్యులుగా కనపడుతున్నా గొప్ప వజ్రం.
37. శ్రీఅఖండ నంద సరస్వతి-సాయి లాంటి సిద్ధపురుషులు ఆత్మ జ్ఞానం అవలీలగా ప్రసాదించగలరు.
38. రాఖాడి బాబా- సాయి దత్త స్వరూపం.
39. పూర్ణ నంద స్వామి- సాయి సన్నిధిలో తపస్సు చేస్తే వైయోగ సంబంధించిన ఇబ్బందులు తొలగి పోతాయి.
40. శ్రీరాం మారుతీ మహారాజ్ నాధ సంప్రదాయంకు అది నాధుడే సాయి నాధుడు.
41. ఇస్లాం పుర్కర్ కులకర్ణి - సాయి గొప్ప తనం తెలుసుకోవాలి అంటే నువ్వు జ్ఞానివి అయిఉండాలి.
42. గజనాన్ మహారాజ్ - సాయిదర్శనం ప్రపంచంలో ఉన్నత మైనది.
43. తాజుద్దీన్ బాబా- బుట్టి తో నీ గురువు సాయి, నీ విషయం లో జోక్యం చేసుకోవటానికి నాకు శక్తి చాలదు.
44. శ్రీ వతా జీ-(మద్రాస్) - త్రేతాయుగంలో వశిష్ఠ, ద్వాపరంలో దత్త త్రేయులు, కలియుగంలో సాయి నాధునిగా అవతరించారు.
45. పాకాలపాటి గురువు గారు (గాయత్రి ఉపసకులు- సాయి సాక్షాత్తు దత్తులే.
46. పూండి స్వామి - ఆయన ఎంతో గుణవంతుడు. సాయి ని పూజించు.
47. బిడ్కర్ మహారాజ్- స్వామి సమర్థకు, సాయినాధునికి ఏమి తేడా లేదు, సాయి గొప్ప యోగి.

ఇలా కొన్ని వందల ప్రశంసలు ఎందరో ఆత్మ సాక్షాత్ కారులు, భగవత్ సాక్షాత్త్ కారులు, యోగులు ప్రశంసించారు.

- రాజ్యలక్ష్మి శ్రీనివాస్ బొడ్డుపల్లి

కృష్ణ భగవానుడిని పురుషోత్తముడిగా కొనియాడతారు, శ్రీ వల్లభాచార్య కృష్ణ నామం పట్ల ఆకర్షితులై ఆయనకు సంబంధించిన 1075 లీలా గుణాలను శ్రీ పురుషోత్తమ నామ సహస్రంగా రాసారు.తెలుగువారైన శ్రీ వల్లభాచార్యుల వారు రచించిన ఈ పురుషోత్తమ నామ సహస్రము అర్థాన్ని తెలుసుకుని సంపూర్ణ భాగవత ఫలం కలుగుతుందని, నమ్ముతారు.

"శ్రీమద్భాగవతమును పూర్తిగా పారాయణ చేస్తే కాని, ప్రసాద స్వీకారము చేయను" అని సంకల్పించుకున్న వల్లభాచార్యుల కుమారుడు ఆ కఠిన నియమ పాలన చెయ్యలేక, బాధపడుతూ ఉండగా, ఆచార్యుల వారు శ్రీమద్భాగవతము నుంచి వెయ్యి అమూల్య రత్నాల వంటి నామాలను వెలికి తీసి, సంస్కృతంలో "పురుషోత్తమ నామ సహస్రము" అనే గ్రంథ రచన చేసి, తన కుమారుడికి ఇచ్చారు. ఈ సహస్రానామానికి శ్రీ రఘునాథుల వారు "నామ చంద్రిక" అనే సంస్కృత వ్యాఖ్యను వ్రాసారు. దానికి తెలుగు అనువాదమే - శ్రీ బలిజపల్లి వేంకట శ్రీరామ చంద్రమూర్తి గారు వ్రాసిన "పురుషోత్తమ నామ సహస్రం" అన్న పుస్తకం. టిటిడి వారి ఆమోదంతో, సౌజన్యంతో ప్రచురించబడ్డ ఈ పుస్తకంలో ఒక్కొక్క నామానికి సంబంధించిన విశేషాలు, అర్థాలు కూలంకషంగా చర్చింపబడ్డాయి. రోజూ ఈ సహస్రానామాన్ని చదివితే, నిశ్చయంగా భాగవత పారాయణ చేసిన ఫలం లభిస్తుందని ఆచార్యులవారు తెలిపారు.

అవతారసమాప్తి:

ఆచార్యులవారు ప్రయాగ వద్ద ఉన్న గ్రామంలో ఉండగా వారికి గోలోకానికి తిరిగి రావాలన్న భగవదాజ్ఞ వచ్చింది. దాన్ని శిరసావహించి ప్రయోగ లోని శ్రీ నారాయణ తీర్థుల వద్ద సన్యాసం స్వీకరించి, అటుపై మండలం రోజులకు, ఆషాడ శుక్ల విదియనాడు కాశీలోని హనుమాన్ ఘాట్‌లో జల సమాధి చెందారు. ఆచార్యుల వారు కలియుగంలో అందరూ సులభంగా ఆచరించదగ్గ పుష్టిమార్గాన్ని, లోక కల్యాణం కోసం అందరికీ తెలియజేశారు. ఇప్పటికీ ఈ మార్గ భక్తి రాజస్థాన్ గుజరాత్ ప్రాంతాల్లో వ్యాప్తిలో ఉన్నది.

(ఈ వ్యాసానికి ప్రాతిపదిక తెలుగులో శ్రీ బివి శ్రీరామచంద్రమూర్తి గారు రచించిన "శ్రీ పురుషోత్తమ నామ సహస్రము" అనే గ్రంథము. వారికి కృతజ్ఞతాపూర్వక నమస్సులు.)

"శ్రీపురుషోత్తమ నామ సహస్రము" అనే అమూల్య గ్రంథ రత్నం ఇప్పుడు తెలుగులో మా వద్ద అమ్మకానికి అందుబాటులో ఉంది. వెల: 150రూ. పోస్టల్ చార్జీలు - భారతదేశంలో ఎక్కడికైనా 40 రూ. అదనం. ఆసక్తి కలవారు వాట్స్ ఆప్ చెయ్యాల్సిన నెంబర్: 8558899478)

- భావరాజు పద్మిని

అలనాటి పూర్తి వ్యావహారిక తెలుగు పౌరాణిక చిత్రం 'శ్రీ సత్యనారాయణ వ్రతం'

తెలుగు సినిమా ప్రారంభ దశలో పౌరాణిక చిత్రాలే ఎక్కువగా రావడం, వాటి భాష నాటకాలలో వలె గ్రాంధిక భాషను అలనాటి పౌరాణికా తెలుగు సినిమాల్లో ప్రయోగించడం జరిగింది. 1936 సం॥లో విడుదలైన 'ప్రేమ విజయం' తెలుగు చిత్రం కూడా గ్రాంధిక భాషలోనే విడుదలైనది. కారణం ఆనాడు రంగస్థలంపై నాటక రచయితలూ, నటీనటులూ, సంగీత దర్శకులూ గ్రాంధిక భాషా వాడుకదారులే.

కాకినాడలోని యంగ్మెన్స్ హాపీ క్లబ్ నాటక సంస్థ నుంచీ వచ్చిన చిత్ర దర్శకుడు చిత్తజల్లు పుల్లయ్య (సి.హెచ్. పుల్లయ్య) సహజంగా మాట్లాడేది వాడుక భాష. ఆ మాట్లాడే భాషలో 'యాస' కూడా ఉంటుంది. కానీ ఆయన చాలావరకూ తీసిన చిత్రాలు పౌరాణికాలే కావడం విశేషం. రెండు పర్యాయములు 'లవకుశ' చిత్రం తీసిన ఖ్యాతి ఆయనకే దక్కింది. పుల్లయ్యగారి చిత్రాల్లో (ఈలాగే పి. పుల్లయ్య రెండు పర్యాయములు 'శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం' చిత్రాన్ని తీశారు). గ్రాంధిక వాసనలు ఉండకుండా ఉండేవి కావు. సన్నివేశానికి, పాత్రలకూ తగిన భాష వాడడం ఆయన చిత్రాలకే చెల్లింది. అలాటి సి. పుల్లయ్య గారు 1938 సం॥ములో నవపథానికి బాట వేస్తున్నట్లుగా 'శ్రీ సత్యనారాయణ' చిత్రాన్ని పూర్తిగా వ్యావహారిక భాషలో నిర్మించడం అప్పట్లో ఓ విశేషం. ఇలా ఎన్నో క్రొత్త ప్రయోగా లను సి. పుల్లయ్య చేశారు.

ఆ రోజుల్లో 'సతీసావిత్రి', 'లవకుశ', 'అనసూయ', 'ధృవ విజయం' చిత్రాలను తీసిన పౌరాణిక చిత్రాల రోజులవి. అవి ఈస్టిండియా ఫిలిమ్ కంపెనీకి ఎంతగానో లాభాలు చేకూర్చాయ్. మార్వాడీలను మరింత శ్రీమంతుల్ని చేస్తున్నారంటూ పుల్లయ్యగారిపై ఘాటైన విమర్శనలు చేశారు 'ప్రజామిత్ర' పత్రికలో గూడవల్లి రామబ్రహ్మంగారు – అంటూనే పుల్లయ్య గారు తెలుగువాడై నిజమైన తెలుగు అభిమానం ఉంటే తెలుగుదేశానికి తరలి రావాలి – అన్నారు. అంటే అప్పుడే 'తెలుగు'పై అపార అభిమానం కల పత్రికా రచయితలు ఆనాడే ఉన్నారన్నమాట విదితం. ఈ విమర్శను పుల్లయ్య సహృదయంతో అంగీకరించారు.

రాజమండ్రిలో నిడమర్తి సూరయ్యగారు దుర్గా సినీ టోన్ స్టూడియోను నిర్మించి 'సంపూర్ణ రామాయణం' చిత్రాన్ని స్వయంగా నిర్మించిన తరువాత ఆ స్టూడియో తలుపులను మూసివేశారు. సి. పుల్లయ్యగారు నెలకూ వెయ్యి రూపాయలు యిచ్చే పద్ధతిన ఆ స్టూడియో నడపటానికి ముందుకు వచ్చి దుర్గా సినీ టోన్ తలుపుల్ని తెరిపించి, పునర్వికాశం చెందిన ఆ స్టూడి యోకు 'ఆంధ్రా టాకీస్' అనే నామకరణం చేశారు. 'ఆవు–దూడ' ఆంధ్రా టాకీస్ పతాక చిహ్నం. 'సతీ అనసూయ' చిత్ర నిర్మాణంలో స్నేహం కలిసినప ముద్దుకృష్ణను దరికి చేర్చుకుని 'ఆంధ్రా టాకీస్' పతాకంపై 'శ్రీ సత్యనారాయణ' చిత్ర నిర్మాణానికి నడుము కట్టారు. అయితే ముద్దుకృష్ణ 'శ్రీసత్యనారాయణ' పౌరాణిక చిత్ర సంభాషణల్ను వాడుక భాషలో పలికించి, తొలి వాడుక భాషా చిత్రంగా 'శ్రీ సత్యనారాయణ' చిత్రాన్ని నిర్మించి విడుదల చేశారు. మొదట పుల్లయ్య పౌరాణిక చిత్రానికి వాడుక భాష యేఁవిటని ప్రశ్నించాను, ముద్దు కృష్ణ సమాధానపరచడంతో ఆయన ముందంజ వేశారు. అప్పట్నుంచీ తెలుగు చిత్రాలు వాడుకభాషలోనే తయారు కావడం ఆరంభించాయ్. అంటే పౌరాణికాల్లో వాడుక భాషను వాడిన ఘనత సి. పుల్లయ్య – ముద్దుకృష్ణలకే చెందుతూంది. సాహిత్యంలో వాడుక భాషను గొని తెచ్చిన గిడుగు రామమూర్తి పంతులుకు చెందినట్లు వీరిరువురికీ చలనచిత్ర పౌరాణిక చిత్రాల్లో వాడుక భాషను వాడిన పేరు సి. పుల్లయ్య – ముద్దుకృష్ణలకే దక్కుతుంది. ఈ చిత్ర నిర్మాణ సందర్భంలోనే ఓ విచిత్ర సంఘటనం జరిగింది. ఫ్లోర్ నిర్మాణమనేది అప్పుడే జరిగింది. ఎత్తైన గోడలు కట్టి, పైన సీసపు రేకుల్ను కప్పుగా కప్పారు. గాలివాన వచ్చి అవన్నీ కొట్టుకుపోయాయి. పుల్లయ్యగారికి ఏఁవి చేయాలో తెలియలేదు. ఛాయాగ్రాహకుడు గోవిందరావు భడాస్లావ్ యిచ్చిన సలహాలతో కలకత్తానుంచి ఓ యాభైకి పైగా సైను చీరలు తెప్పించి, వాటినన్నిటినీ కలిపి కుట్టి పైన కప్పుగా వేశారు. ఆ గుడ్డపై పడిన ఎండ ప్రభావితంలో సన్నివేశాల్ని చక్కగా సృష్టించి చిత్రనిర్మాణం పూర్తి కావించారు. తరువాత ఈ పద్ధతి కొంతకాలం కొనసాగింది.

శ్రీ సత్యనారాయణస్వామి చిత్రంలో శ్రీ సత్యనారాయణుడుగా వాడ్రేవు కామరాజు, ఇతర పాత్రల్లో దేవరకొండ రామమూర్తి, కడియం మల్లాచారి, కళావతిగా హైమావతి, లీలావతిగా లక్ష్మీ నరసయ్య, యనమండ్ర రామకృష్ణయ్య, రేలంగి, గోట్టిమాకుల కోటేశ్వరరావు నటించారు.

ఈ చిత్ర వ్రతకల్పం ఆధారంగా నిర్మింపబడడం వలన చిత్రం నిడివి 10 వేల అడుగులు మాత్రమే వచ్చింది. ఆ తరువాత అన్నవరం సత్యనారాయణస్వామి డాక్యుమెంటరీని జతపరిచారు. ఆ కాలం చిత్రాలకు ఆ నిడివి చాలదు కావున 'కాసులపేరు' చిన్న చిత్రాన్నీ, చలో మోహనరంగా పాటను జతపరిచి 1938 జనవరి 12 సంక్రాంతి కానుకగా విడుదల చేశారు. 'కాసులపేరు'లో వందన గోపాలరావు, కాళ్లకూరి హనుమంతరావు, సుందరయ్య, శ్రీహరి, తులసి నటించారు. ఆనాడు ప్రాచుర్యంలో ఉన్న 'ఛల్ మోహనరంగా' నృత్య చిత్రంలో పుష్పవల్లి, వాలి సుబ్బారావు నటించారు.

ఇలా వ్యావహారిక భాష, లఘుచిత్ర సమ్మేళనంగా శ్రీ సత్యనారాయణ విడుదలయి క్రొత్త పంథాకు నాందియైంది. ●

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation

Lovely Stay at Holy Tirupathi *The Gateway of Lord Balaji*
HOTEL MAYURA
204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

భగవంతుని లీల అద్భుతం! ఎలుకయే మహారాణియైంది!

అన్యచింతలు కలిగి, అపరిశుద్ధులైయుడీ, భగవత్సేవను ఏ రూపంలో చేసినప్పటికినీ, భగవంతుడు హర్షిస్తాడు. వారి దోషములను నశింప చేస్తూ మోక్షమును ప్రసాదిస్తాడనీ, ఉత్తమ జన్మ కలిగిస్తాడనీ స్కాందపురాణం చెబుతూంది.

సకృదుచ్చారితం యేన హరి రిత్యక్షర ద్వయం
బద్ధః పరికరస్తేన మోక్షాయ గమనం ప్రతి'

– 'హరి' యనెడు రెండు అక్షరాలను ఒక్కసారి ఉచ్చరించినా – వాడు మోక్షమును పొందగలడు. భగవంతుని అనుగ్రహం లభిస్తుంది. అలాటిదే హరిసేవ కూడా! ప్రయత్నంగానీ, అప్రయత్నంగానీ, అతడు, లేదా ఆ ప్రాణి చేసిన సేవను భగవంతుడు గుర్తుంచుకొంటాడు. మోక్షాన్ని ప్రసాదిస్తాడనడానికి ఈ ఎలుక ఉదంతమే నిదర్శనం :

'ఓ దేవాలయంలో ఉన్న ఓ ఎలుక భగవంతునికి దీపారాధన చేసే నేతి వృత్తులను (ప్రత్తి వత్తులను) పట్టుకుని పోయి తింటూండేది. దానికో వృత్తియై పోయింది. ఓనాడు తెరచి ఉన్న డబ్బాలోని వత్తులను నోటగరచుకుని పోతున్నప్పుడు, అక్కడ వెలుగుతున్న జ్యోతికి తగిలి అంటుకుని పెద్దగా ఓ హారతిలా వెలిగి, అక్కడున్న హరి విగ్రహానికి నీరాజనమిచ్చినంతటి వెలుగు కలిగి, భగవంతుని మోము తేజస్సుతో భాసిల్లింది. ఆ మంటల్లో అటూ ఇటు తిరిగిన ఎలుక కాలిపోయింది, ప్రాణాలు జ్యోతీ ప్రజ్వలనంగా ప్రజ్వరిల్లి దగ్ధమైంది.

నిజంగా, ఆ ఎలుక భగవంతునికి నీరాజనమివ్వలేదు. దానికి భక్తి ఉందా లేదా అన్నది భగవంతుడు చూడలేదు. తనకి అన్ని వత్తులలో 'నీరాజనమిచ్చింది, ప్రాణాలను ఆహుతి చేసుకున్నది పరమాత్మ ఆ ఎలుకకు పుణ్యఫలంగా, ఓ పట్టపురాణిగా పుట్టే అనుగ్రహాన్ని కూర్చాడు. భక్తితన్మయత్వాలతో ఆమెను తరించేట్టుగా జీవితాన్ని మలిచాడు. ఆమె తన రాజ్యంలోని ఆలయాల్లో దీపోత్సవాలను వైభవంగా నిర్వహిస్తూ, సంపూర్ణ జీవితకాలం సుఖైశ్వర్యాలను పొంది, వైకుంఠ ధామం చేరుకుంది. జన్మరాహిత్యం పొందింది.

అలాటి హరిని, శ్రీమన్నారాయణుణ్ణి
త్వమేవ మాతా చపితాత్వమేవ
త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ
త్వమేవవిద్యా ద్రవిణం త్వమేవ
త్వమేవ సర్వం మమదేవదేవ'

– అంటూ **నీవే తల్లివి తండ్రివి – నీవే నాతోడు నీడ నీవే సఖుడౌ**
నీవే గురుడవు దైవము – నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా

– అంటే, ఆయన ఇంకా ఎంత సంతసిస్తూ, ముక్తినిస్తాడో కదా!

మన భరతభూమి చేసుకున్న పుణ్యమేమో గాని, పురుషోత్తమ క్షేత్రం 'పూరి' తూర్పు ద్వారంగా, ద్వారక పశ్చిక ద్వారంగానూ, బదరికాశ్రమం ఉత్తర ద్వారం గానూ, రామేశ్వరం దక్షిణ ద్వారంగానూ భక్తరక్షణ కవచంగా అలరాయి. ●

నన్నయ్యయుఁ దిక్కన్నయు
నన్నా వేశించిరి పరిణాహ మనస్సం
ఛన్నత వారలుపోయిన
తెన్నున మెఱుఁగులను దీర్చి దిద్దుచుఁ బోదున్.

– విశ్వనాథ సత్యనారాయణ గారు

ఎక్కడో వ్యాసంలో చదివానొకసారి. తరాలు మారుతున్నప్పుడు ఆధునిక పోకడల వెంట వెంపర్లాట ఉద్ధతి ఎక్కువగా ఉన్నప్పుడు కొత్తదార్లు వెతకడం, కొత్తదార్లు కనిపెట్టడం సహజ ప్రక్రియగా సాగుతుంది. కానీ, ఆ సమయంలోనూ ప్రాచీనమూ ప్రశస్తమూ ఐన దారిని వదలక, ఆ దారిలోనే నడుస్తూ, ఆ దారినే కొత్తగా, అందంగా, ఉత్సుకత, ఉత్సాహం నింపేదిగా, హంగులద్ది ఆ దారిని పరిపుష్టంచేసి కొత్త వింత చెత్తపోకడలను నిలువరించి, వాని ప్రాభవం తగ్గించడం ఏ కొందరికో సాధ్యం. సాహితీ సంస్కరణలపేరిట తెలియకుండా ఆంధ్ర సారస్వతంపై, సనాతన సంస్కృతీ సంప్రదాయాలపై జరిగిన దాడిని ఒంటి చేత్తో ఎదుర్కొని, అన్నంలో బెడ్డలా తీసేసిన మహనీయుడు.

కావ్య సాహిత్యానికీ, పద్య సాహిత్యానికీ సనాతన ధర్మ సాహిత్యానికీ రోజులు చెల్లాయనుకుంటున్న రోజుల్లో, నన్నయ తిక్కన నన్నావేశించారని చాటుకుని ఎదురొడ్డి ప్రాచీన సాహిత్య ప్రక్రియలను అతి వేగంగా కొత్తపుంతలు తొక్కించి అవతలి వారికి ముచ్చెమటలు పట్టించిన ధీశాలి.

– అయ్యగారి నాగేంద్రకుమార్

ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్థన!

ప్రముఖాంధ్ర గత 26 సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? 'వేలు'గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.

అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అఖూంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినెలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో – మేమూ అలానే మీ ప్రతీ 'రూక'నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. 'ప్రముఖాంధ్ర'ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న డబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.

రూ.251, 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా

ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :

Account Name	:	PRAMUKHANDHRA
Account No	:	20011102592
Bank	:	BANK OF MAHARASTRA, T.NAGAR
IFSC Code	:	MAHB 0000450

ప్రముఖాంధ్ర
64, తంబయ్యరెడ్డి వీధి, వెస్ట్‌మాంబళం, చెన్నై – 33.
మొబైల్ : 98400 48941

భారతదేశ దీప్తి నొందించిన ధీర వీరులు!

మహారాణాప్రతాప్ : ఇతడు మేవాడు రాజ్యానికి రాజు. ఉదయసింహుని కుమారుడు. విధర్మీయులకు వ్యతిరేకంగా కాషాయ పతాకాన్ని ఉన్నత శిఖరాలపై రెపరెపలాడించాడు. హిందూరాజులు స్వాభిమానాన్ని విడిచి అక్బరుకు దాసోహం అయి, దీన్-ఇ-ఇలాహీ-పేరున హిందూ కన్యలను దానం చేస్తున్న సమయంలో ధీరుడై అక్బరును ఎదురించాడు. "వీరులకు వీరమాతలకు నిలయమైన చిత్తోడు దుర్గాన్ని విముక్తం చేసేవరకు బంగారుపళ్లెంలో భుజించను, పరుపులపై నిద్రించను, రాజభవనాలలో నివసించను" అని భీషణ ప్రతిజ్ఞ చేసిన స్వాభిమాన వీరుడు. గిరివాసులు, వనవాసులైన భిల్లులను సైన్యంలో చేర్చుకొని 22 వేల సైన్యంతో 2 లక్షల సైన్యం గల అక్బరుతో హల్దీఘాట్ వద్ద ప్రతిఘటించాడు. ఆయన గుఱ్ఱం అయిన 'చేతక్' కూడా స్వామిని రక్షించుటలో వీరమరణం పొందింది. చివరి దశలో కూడా చిత్తోడు, మంగళఘట్ వంటి దుర్గాలను వశం చేసుకుంటానని తన కుమారుని వద్ద మాట తీసుకొని అస్తమించాడు. దేశ, ధర్మ, సంస్కృతుల, స్వాభిమాన రక్షణకు, స్వాతంత్ర్య సాధనకు ఆయన చేసిన కృషి మనకు ప్రేరణ కావాలి!

శివాజీ: హిందూ సమాజానికి ఛత్రం (గొడుగు)లా మొగలులను ఎదిరించటానికి 1630లో శివాజీ జన్మించాడు. అగర్ శివాజీ నహో తాతో సఃఉన్నత్ హో తీ న ఓకీ (శివాజీ లేకపోతే అందరికీ సున్తీ చేయబడేది). భవానీ భక్తుడు, హిందూ సామ్రాజ్య నిర్మాత అయిన శివాజీ దేశ, ధర్మ, గో, వేదాది రక్షణకు అంకితమైనాడు. 12 సం॥ల వయస్సులో మావళీలలో దేశభక్తిని నింపి తోరణ దుర్గాన్ని జయించాడు. దాదాజీ కొండదేవ్ వద్ద శస్త్రాస్త్ర విద్యాలను నేర్చాడు. తల్లి పెంపకంలో సాంస్కృతిక భావధార, తుకారామ్ బోధనలలో ఆధ్యాత్మిక భావధార, సమర్థ రామదాసు నుండి నైతిక, రాజనీతి భావధార పొందాడు శివాజీ. అఫజల్‌ఖాన్, సిద్ధి ఔహర్, షయిస్తఖాన్, ఇనాయిత్‌ఖాన్, దిలేర్‌ఖాన్ వంటి ధర్మద్రోహులతో పోరాడాడు. ప్రతాప్‌ఘడ్, సింహఘడ్, పన్హాల్‌ఘడ్, విశాల్‌ఘడ్, రాయఘడ్ వంటి దుర్గాలను జయించాడు. శివాజీతో పాటు మోరోపంత్ పింగళే, తానాజీ మున్సులే, సూర్యాజీ మున్సులే, నేతాజీ ఫాల్కర్, అబాజీ సోందేవ్, బాజీ ప్రభుదేవ్ పాండే వంటివారు ధ్యేయనిష్ఠకు అంకితులైనారు. పరస్త్రీని తల్లిగా భావించే హిందూ సంస్కృతికి ప్రతిరూపంగా నిలిచి అహ్మద్‌ఖాన్ కోడలిని ఇంటి ఆడపడుచు వలె అత్తగారింటికి పంపాడు. శివాజీని ఆగ్రా కోటలో ఔరంగజేబు బంధించినప్పుడు ఉపాయంతో తప్పించుకున్నాడు.



రణజిత్ సింహుడు : 40 సం॥ల పాటు పంజాబ్, జమ్ము, కాశ్మీరులను కలిపి సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించాడు. హరిసింగ్ నల్వా, జోరావర్ సింహా సేనాధిపతులతో శక్తివంతమైన సైన్యాన్ని ఏర్పాటుచేశారు రణజిత్ సింహుడు. గోవధను నిషేధించాడు. మజినీ తీసుకు పోయిన సోమనాథ మందిరం ముఖ ద్వారాన్ని తిరిగి భారత్‌కు తీసుకువచ్చేందుకు ప్రయత్నించాడు.

లాచిత్ బడ్‌పుకున్ : అస్సాంను తమ ఆధీనములోనికి తీసుకోవాలని ప్రయ త్నించగా మొగలుల గుండెల్లో నిద్రపోయిన హైందవ సింహం. దేశ రక్షణలో బాధ్యతా రహిత్యంగా ఉన్న పినతండ్రి తల నరికిన దేశభక్తుడు. అస్సామీలో 'ల' అంటే రక్తం, 'చిత్' అంటే తడిసిన అని అర్థం. 'బడ్‌పుకన్' అంటే సేనాధిపతి అని అర్థం. బలం ఇతని ఆస్తి. వీరత్వం ఇతని ఆభరణం. లాచిత్ గువాహతికి ప్రధాన సేనాని అయి నాడు. 1674 విజయదశమినాడు లాచిత్ యుద్ధం చేస్తున్న నౌక సరిగా లేనప్పటికి విరోచితంగా రాయసింహ నాయకత్వంలో వచ్చిన మొగలు సైన్యాన్ని తరిమికొట్టడు.



యశోధర్ముడు : హూణులను జయించాడు. ఇతని సామ్రాజ్యం బ్రహ్మపుత్ర నుండి మహేంద్ర పర్వతం వరకు హిమాలయం నుండి పశ్చిమ సాగరం వరకు వ్యాపించింది. మహాక్రూరుడైన మిహిరక్కుని ఓడించాడు.

లలితాదిత్యుడు : ప్రతాపదిత్యుని కుమారుడైన లలితాదిత్యుడు చైనా నుండి వచ్చిన దాడులను త్రిప్పికొట్టిన కాశ్మీర్ ప్రాంత రాజు. అరబ్బులను, టర్కీ, తార్ మొదలగు ముస్లిం దురాక్రమణదారులను వెంటబడి తరిమికొట్టాడు. పంజాబు, కనోజ్, టిబెట్‌లను తన రాజ్యంలో విలీనం చేశాడు.

బాప్పారావల్ : ఇతడు నల్లగా ఉన్నందున అందరూ 'కాలభోజుడు' అని పిలిచేవారు. 12 సం॥ల వయస్సులో గోవును చంపబోయిన పులిని అడ్డుకొన్నాడు. బీరాలు పలుకుతూ సవాలు చేసిన అరబ్బు వీరులను కత్తియుద్ధంలో మట్టి కరిపించాడు. చిత్తోడు రాజు మరణానంతరం, ప్రజల కోరికపై చిత్తోడు రాజ్యాధికారాన్ని చేపట్టాడు. అరబ్బులను సింధు ప్రాంతానికి అవలివైపుకు తరిమి తరిమికొట్టి, రసపుత్ర వీరుల పౌరుషాన్ని తెలియజేసి నాలుగు దశాబ్దాల పాటు దేశ, ధర్మ, సంస్కృతుల రక్షణకు నడుం బిగించాడు.

శైలేంద్రుడు : 7వ శతాబ్దికి చెందిన ఉత్కళ ప్రాంత రాజు శైలేంద్రుడు. ఆయన తన సామ్రాజ్యాన్ని బర్మా, సువర్ణదీపము (మలేషియా, ఇండోనేషియా) వరకు వ్యాపింపచేశాడు. సుమారు 700 సం॥ల పాటు శేలేంద్ర వంశీయులు హిందూ ధర్మాన్ని, సంస్కృతులను వర్ధిల్లచేశారు. ఆయన కట్టించిన దేవాలయాలు ఇంకా అక్కడ ఉన్నాయి.

చంద్రగుప్తుడు : చాణక్యుని శిక్షణలో తీర్చిదిద్దబడ్డ పరాక్రమశాలి. మురు కుమారుడు మౌర్య చంద్రగుప్తుడు. వివిధ పరగణాలలో రాజుల సహాయంతో గ్రీకు సైన్యాన్ని ఎదిరించిన మహావీరుడు. చాణక్యుని సహాయంతో అతిపెద్ద నంద సామ్రాజ్యాన్ని జయించిన మహావీరుడు. తరువాత గ్రీకు సైన్యాధ్యక్షుడైన సెల్యూకస్‌ను కూడా ఓడించి అతని కుమార్తెను వివాహమాడాడు.

విక్రమాదిత్యుడు : శకాది విక్రమాదిత్యుడుగా లోకప్రసిద్ధి చెందాడు. అవంతిలో ఉన్న శకరాజుపై దండెత్తి ఓడించి భారతదేశానికి శకుల వలన ప్రమాదం లేకుండా చేశాడు. ఈ పేరున క్రీ.పూ. 58 సం॥లో కలియుగాబ్ది 3044 సం॥లలో ఉగాదినాడు ఈయన పేర శకం ప్రారంభమైంది. దానినే విక్రమ శకం అంటారు. ఈయన అయోధ్యలో దివ్యమైన, భవ్యమైన రామమందిరాన్ని నిర్మించాడు.

శాలివాహనుడు : ధనకటకము (అమరావతి వద్ద నున్న ధరణికోట) రాజధానిగా శాతవాహన సామ్రాజ్యాన్ని ఏర్పాటుచేశాడు. ఈయన శకులతో పోరాడి వారిని తరిమికొట్టాడు. సుమారు 400 సం॥ల పాటు శాలివాహనులు దక్షిణాపథంలో హిందూ సామ్రాజ్యాన్ని ఏలారు. వీరి పేరిట కలియుగాబ్ది 3180 సం॥లో (క్రీ.శ. 78వ సం॥) శాలివాహన శకం ప్రారంభమైంది.

సముద్రగుప్తుడు: యావత్ భారతదేశాన్ని ఒకే తాటిపైకి తీసుకువచ్చి మహా సామ్రాజ్యంగా పరిపాలించిన మహావిజేత అతడు. అశ్వమేధయాగం చేశాడు. స్మిత్ అనే చరిత్రకారుడు ఈయన్ని నెపోలియన్‌తో పోల్చాడు. ఈయన కాలం స్వర్ణయుగంగా భావిస్తారు. అనేక కవులు, కళాకారులు పోషించాడు. విదేశీయులను పూర్తిగా దేశం నుండి పారద్రోలాడు.

హర్షుడు: కన్యాబ్జము (కనౌజ్) రాజధానిగా సువిశాలమైన సామ్రాజ్యాన్ని ఏర్పరచిన మహాచక్రవర్తి హర్షుడు. భారతదేశం నుంచి రాక్షసజాతి అయిన హూణులను పూర్తిగా తరిమొకొట్టాడు. చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ ప్రకారం హర్షుడు ప్రతి 5 సం॥లకు ఒకసారి ప్రయాగలో విశాల సమ్మేళనం ఏర్పరచి తనవద్దనున్న పూర్తి ధనాన్ని ధర్మం చేసేవాడు. ఆయన నాగానందము, ప్రియదర్శిక రత్నావళి అనే గ్రంథాలు వ్రాశాడు. బాణభట్టు ఈయన ఆస్థానకవి.

అల్లూరి సీతారామరాజు: తెల్లదొరల కెదురు తిరిగి సింగమువోలె దుమికి పోరు సలిపి, తుట్ట తుదకు అసువులొడ్డిన అల్లూరి అమరుడు.

తాండ్రపాపారాయుడు: పురిటిగడ్డ స్వేచ్ఛకై ప్రాణాలొడ్డిన యోధుడు బొబ్బిలికోట బురుజుపై వన్నెచెరగనిది తాండ్రపాపయ తళతళల బాకు.

కొమరం భీమ్ : మా గూడెం మా రాజ్యం అంటూ గర్జించాడు తెల్లవారికెదురు నిలిచి తెగువగ పోరాడాడు. ఇతడు మరువరాని మన గిరిజన భీముడు. ●

పనికొచ్చే పాత పాట :

చేయెత్తి జైకొట్టు తెలుగోడా...

పల్లెటూరు చిత్రంలో వేములపల్లి శ్రీకృష్ణగారు రచించిన పాట, నాకు గుర్తుకొచ్చి మీకు గుర్తు చేస్తున్నా. చదివి తెలుగువాడి కీర్తి తెలుసుకోండి. పాడినవారు మన ఘంటసాల గారు.

చేయెత్తి జైకొట్టు తెలుగోడా
గతమెంతో ఘనకీర్తి కలవోడ
వీరరక్తపు ధార వారపోసిన సీమ
పలనాడు నీదెరా వెలనాడు నీదెరా
బాలచంద్రుడు చూడ ఎవరోడోయ్
తాండ్రపాపయ గూడ నీవాడోయ్
నాయకీ నాగమ్మ, మల్లమాంబ, మొల్ల
మగువ మాంచాల నీ తోడబుట్టినవాళ్లె
వీరవనితల గన్న తల్లేరా
ధీరమాతల జన్మభూమేరా
కల్లోల గౌతమి, ఆ... వెల్లువల కృష్ణమ్మ ఆ...
కల్లోల గౌతమి, వెల్లువల కృష్ణమ్మ
తుంగభద్రా తల్లి పొంగిపారిన చాలు
ధాన్యరాసులె పండు దేశాన
కూడుగుడ్డకు కొడువ లేదోయి
ముక్కోటి బలగమై ఒక్కటై మనముంటె
ఇరుగుపొరుగూలోన ఊరు పేరుంటాది
తల్లి ఒక్కతె నీకు తెలుగోడా
సవతి బిడ్డల పోరు మనకేల
పెనుగాలి వీచింది, అణగారిపోయింది
నట్టనడి సంద్రాన నావ నిలిచుండాది
చుక్కాని బట్టరా తెలుగోడా
నావ దరిజేర్చరా మొనగాడ
చేయెత్తి జైకొట్టు తెలుగోడా
గతమెంతో ఘనకీర్తి కలవోడ.

సేకరణ : శ్రీ కొల్లూరి నాగేంద్రం

Beautiful City - Beautiful Hotel
DO NOT MISS

Foreverar your Serivice in the Heart of Visakhaparnam
HOTEL Daspalla
Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

మానవజన్మ ఒక మహోన్నతమైన ఇంజనీరింగ్ కళ

మహోన్నతమైనది మానవజన్మ ఎనుబది నాలుగు లక్షల జీవరాసుల్లోనుండి వచ్చినగాని ఈ పవిత్రమైనటువంటి మానవజన్మ లభించదు. అందుకు మానవుడు ఎంతో గర్వించాలి. జన్మనిచ్చిన తల్లిదండ్రులకు సర్వదా ఋణపడి ఉండి వారికి సేవ చేసుకోవాలి. కేవలం మదర్ డేలలో, ఫాదర్స్ డేలలో మాత్రమే కాదు ఇంత భవ్యమైనటువంటి జన్మలో మానవునికి కష్టాలు, కన్నీళ్ళు ఎందుకు? సుఖాలకు పరిమితమై తల్లిదండ్రులను, ఎల్లకాలము వారికి రుణపడి సేవలందించాలి. సృష్టికర్తనే మరచి, రాలిపోవుట ఎంతవరకు సబబు. ఇలా ఆలోచిస్తూ పోతే అంతుబట్టదు ఈ ప్రపంచము. కష్టనష్టాలు, సుఖదుఃఖాలు, ఆనందాలకు నిలయమైన ఈ అద్భుత లోకము ఒక అనంతమైనది. అతి సుందరమైనది. పుష్పములలో దారం లాగ విశ్వంలో వాయువులాగా భగవంతుడు అంతటా నిగూఢమై యున్నాడు. జీవునికి ఆధారం గాలి, నీరు కల్పించిన పరమేశ్వరుడు ఈ బ్రహ్మాండమంత అణువణువునా గాలివలె నిండి యున్నాడని ఘంటాపథంగా చెప్పవచ్చును. త్రేతాయుగం, ద్వాపరయుగంలో, భగవంతుని చేరాలని జిజ్ఞాస గలవారు ఆ దేవుని సాక్షాత్కరించుకొని ముక్తిని పొందారు. కాని కలియుగ ప్రవేశానంతరం అదే మానవుడు కోరికలనే సుఖాలవెంట పరుగెడుతూ దానికవసరమయ్యే డబ్బు సంపాదించాలన్న ఆశతో జీవిస్తున్నాడు. పరుగెత్తి పాలు త్రాగే మానవునికంటే నిలబడి నీళ్ళు త్రాగే మానవుడు ఎంత హాయిని, ఎంత తృప్తిని పొందుచున్నాడో తెలుసుకొనలేకపోతున్నాడు. పెద్దలు, న్యాయ, ధర్మ మార్గములో నడుస్తూ పిన్నలకు నేర్పాలి. ఓర్పు, సహనం వారికి అలవాటు చెయ్యాలి. గురువుల యెడ పూజ్యభావము, పెద్దలయెడ గౌరవము, పిన్నల యెడ ప్రేమ వారికి రంగరించి పోయాలి.

మానవ శరీరము ఒక అత్యద్భుత సృష్టి. ఇది ఒక భగవంతుని రోబోవలె సృష్టించిన కళ. భగవంతుడిచ్చిన వరము. సాధన చేస్తూ ముక్తిని పొందే అవకాశం మానవునికిచ్చాడు. మనసా, వాచా, కర్మణా సాధన చేయాలి. పంచభూతాలు తానేయై పంచభూతాలలో తయారైన ఈ శరీరం అంతరాత్మలో తన ప్రతిరూపమై పరమాత్మ నిలిచాడు. ఈ శరీరము కదిలే దేవాలయము అని చెప్పవచ్చు. కనులలో వెలుగు, కంఠంలో నాదము, చెవులలో వినికిడి, కాళ్ళలో కదలిక, స్పర్శ, ఇవన్నీ ఒక ఇంజనీరింగ్ కళయే. వీటికి మూలం భగవంతుడే. ఇది కంటికి కనిపించవు. అనుభవముతోగాని తెలిసికొనలేదు. వీటన్నిటిని మించి అత్యద్భుతమైనటువంటి గుణము మనకు కలదు. అన్నిటికన్నా వేగంగా పరుగెత్తగలదు. మనసులో మహోన్నత స్థితికి, అధోగతికి మూలము మనస్సుకు ఇచ్చాడు. దీనికి సరియైనటువంటి దారిలో పెట్టుటకు బుద్ధినుపయోగించాలి. కోరికల వెంబడి పరుగెత్తకుండ మనస్సునకు కళ్ళెం వెయ్యాలి. ఇంద్రియ నిగ్రహములలో ఇది ఒకటి. ఈ లోకములో వ్యవహరించుటకు మానవునికి బుద్ధి, జ్ఞానము, చదువు చాలా చాలా అవసరము. జీవిత పరమావధిని సాధించుటకు క్రమశిక్షణ సమయపాలనము ముఖ్యము. ఎంతో విలువైన ఈ జన్మలో ఒక గంట వృథా చేసినా తిరిగి పొందలేము. దానమైనా సేవయైనా ఈ జన్మమందే చేసుకోవలయును. ఎందుకంటే మరుజన్మ మానవజన్మ లభించునో లభించకపోవునో కాబట్టి కళ్యాణము కొరకు శ్రమించాలి. అప్పుడే మానవజన్మ సార్థకమవుతుంది. అందరిలో ఆ భగవంతుని చూచినవాడే ధన్యుడు.

– అమరా వెంకట రాఘవరావు

ధనుర్మాసం

ఈనెల 16 నుండి ధనుర్మాసం ప్రారంభం
డిసెంబరు 16 నుండి జనవరి14వ తేదీ వరకు
శ్రీవారి ఆలయంలో సుప్రభాతం స్థానంలో తిరుప్పావై

శ్రీ మహావిష్ణువు మాసోత్సవాల్లో అత్యంత ముఖ్యమైనదిగా భావించే ధనుర్మాసం డిసెంబరు 16వ తేదీన ప్రారంభం కానుంది. ఆనాటి ఉదయం 6.04 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభం కానున్నాయి. తిరుమలలో డిసెంబరు 17వ తేదీ నుండి స్వామివారికి నిర్వహించే సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదిస్తారు. కాగా ధనుర్మాస ఘడియలు 2021, జనవరి 14న ముగియనున్నాయి.

ధనుర్మాసానికి విశేష ప్రాధాన్యం

పురాణాల ప్రకారం ధనుర్మాసంలో దేవతలు సూర్యోదయానికి ఒకటిన్నర గంట ముందుగా నిద్రలేచి బ్రహ్మ ముహూర్తంలో శ్రీమహావిష్ణువును ప్రత్యేకంగా ప్రార్థిస్తారు. కావున ఈ మాసానికి సౌరమానంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.

దైవప్రార్థనకు అనుకూలం

తాను అన్ని మాసాల్లో ఉత్తమమైన మార్గశిర మాసం లాంటివాడినని శ్రీమహావిష్ణువు స్వయంగా చెప్పినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. ధనుర్మాసాన్ని శూన్యమాసం అని కూడా పిలుస్తారు. ఈ మాసంలో భగవంతునికి సంబంధించిన కార్యక్రమాలు తప్ప ఇతర కార్యక్రమాలు సాధారణంగా చేయరు. పూర్తిగా దైవంపైనే శ్రద్ధ వహించి ప్రార్థించాలన్నదే ఇందులో అంతరార్థం.

ధనుర్మాస పూజ వెయ్యేళ్ల ఫలం

కలియుగంలో శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీవేంకటేశ్వరుని ధనుర్మాసంలో ఒకరోజు పూజించినా వెయ్యేళ్ల పూజాఫలం దక్కుతుంది. పూర్వీకుల వారసత్వాన్ని కొనసాగిస్తూ భక్తులు ఈ మాసంలో బ్రహ్మ ముహూర్తంలో ధనుర్మాస పూజలు చేస్తారు.

ఆండాళ్ తిరుప్పావై పారాయణం...

12 మంది ఆళ్వార్లలో శ్రీ ఆండాళ్(గోదాదేవి) ఒకరు. ఈమెను నాంచియార్ అని కూడా పిలుస్తారు. ద్వాపర యుగ శ్రీకృష్ణుడు అయిన తిరుమల శ్రీవారిని స్తుతిస్తూ ఆండాళ్ రచించిన 30 పాశురాలను కలిపి తిరుప్పావై అంటారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలో తిరుప్పావై ఒక భాగం. తమిళ సాహిత్యంలో దీనికి విశేష ప్రాచుర్యం ఉంది. శ్రీవారి ఆలయంలో నెల రోజులపాటు జరిగే తిరుప్పావై పారాయణంలో రోజుకు ఒకటి వంతున అర్చకులు నివేదిస్తారు. ఈ సందర్భంలో సాధారణంగా భోగశ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకృష్ణస్వామివారికి ఏకాంతసేవ నిర్వహిస్తారు. ఈ తిరుప్పావై పఠనం పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది.

ధనుర్మాస వ్రతం

శ్రీ గోదాదేవి ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి చూపారు. ఈ వ్రతాన్ని ఆచరిస్తే సుఖసంతోషాలు ఒనగూరుతాయని తెలియజేశారు. సూర్యుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించేందుకు మధ్యగల కాలాన్ని ధనుర్మాసం అంటారు. పాపకర్మలను నశింపచేసి మోక్షసాధనకోసం చేసే వ్రతాలు, పూజలు, ఇతర ధార్మిక కార్యక్రమాలకు ఈ మాసం అనువైనదిగా భావిస్తారు.

(సేకరణ)

జనవరి 2021 ప్రముఖాంధ్ర

ప్రత్యేక ఆకర్షణలలో, ఆకట్టుకునే ఆసక్తికరమైన వ్యాసాలతో, చక్కగా, సుందరంగా వెలువడుతూంది. ఎప్పటిలా మీ ఆదరణ వుంటుందనే విశ్వాసంతో...

మీ గోటేటి వెంకటేశ్వరరావు

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA
December 2020

REGN. No. TN/CC(S)DN/177/18-20
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97

GOTETI GRAPHICS

64 (16), Thambiah Road
West Mambalam
Chennai - 600 033
INDIA

☎ : 044 2474 2091 / 2371 6322
✆ : 098400 48941
E-mail : gotetigraphics@gmail.com

Our print support creates a remarkable value in your business